# 23, 24 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు

• మండలి బుద్ధ ప్రసాద్

లోపలి పేజీలో..



PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 141 | విజయవాడ, గురువారం 22 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : రూ. 5. 50

Vol No | Vijayawada, Thursday 22 December 2022 | Rs





తరతరాల రంగుల కళ

లోపలి పేజీలో..


# పాఠశాలల్లో డిజిటల్ విప్లవం

• పెత్తందారుల పిల్లలకేనా ఇంగ్లీష్ చదువులు • విద్యార్థులకు ట్యాబుల పంపిణీలో ముఖ్యమంత్రి జగన్

**ప్రజాశక్తి- బాపట్ల**

పెత్తందారులు, ఉన్నత వర్గాలకే పరిమితమైన ఇంగ్లీష్ మీడియం చదువును ప్రతి పేద విద్యార్థికీ అందించడమే తమ ముందున్న ప్రథమ కర్తవ్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా కోర్టులకెళ్లి పేద విద్యార్థులకు చేయాలనుకుంటున్న మంచిని ఆపాలని చూస్తోన్న కొందరిని చూస్తే బాధనిపిస్తోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తెస్తామని, వాటి ఫలితాలను రాష్ట్రంలోని పేద కుటుంబాలు వచ్చే పదేళ్లలో అనుభవిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన విద్యార్థులకు ఉచిత ట్యాబుల పంపిణీ కార్యక్రమాన్ని బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లిలోని జెడ్‌పి పాఠశాలలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న 4,59,564 మంది విద్యార్థులకు, 59,176 టీచర్లకు మొత్తంగా 5,18,740 ట్యాబుల పంపిణీకి బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. బైజూస్ ప్రీ లోడెడ్ కంటెంట్‌తో అందించనున్న ఈ ట్యాబుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,466 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల భవితకు భరోసా ఇచ్చేందుకు, పేద విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్య



విద్యార్థులకు అందించిన ట్యాబ్‌తో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

అందించేందుకు ఉక్కు సంకల్పంతో మన బడి నాడు నేడు మొదలుకొని నేటి ట్యాబుల పంపిణీ కార్యక్రమం వరకూ తమ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో పనిచేస్తోందన్నారు. 'భావితరాలకు సారథులైన విద్యార్థులకు ఉపయోగపడే మంచి కార్యక్రమం నా పుట్టిన రోజున చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. పిల్లలకు మరింత సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు వీలుగా ట్యాబులు అందిస్తున్నాం. క్లాస్ టీచర్ చెప్పే పాఠశాలకు ఇవి సపోర్ట్‌గా ఉంటాయి' అని పేర్కొన్నారు. ఆర్థిక స్థోమతలేక పిల్లలను చదివించుకోలేని తల్లిదండ్రుల బాధలు చూశానని, ఆ కుటుంబాల పరిస్థితి మారాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించానని పేర్కొన్నారు. మన బడి నాడు నేడు పథకంలో విద్యా రంగంలో వినూత్న సంస్కరణలకు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. సమాజంలోని పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చదువులు అందిస్తున్నామని, తద్వారా అంతరాలు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. పేదలకు ఇటువంటి చదువు అందకూడదనే పెత్తందారీ భావజాలం చూస్తే వీరికి పేదలు ఎదగడం ఇష్టం లేదన్న అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే చదువులో సమానత్వం ఉండాలని, మంచి విద్యా విధానంతో పిల్లల భవిష్యత్తు మారనుందని అన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తోన్న ట్యాబుల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీతో పాటు దాదాపు ఎనిమిది భాషల్లో పాఠ్యాంశాలు ఉంటాయని తెలిపారు. పిల్లలకు నష్టం జరిగే కంటెంట్‌ను ట్యాబుల్లో తొలగించామన్నారు. ఒక్కో ట్యాబులో రూ.32 వేలు విలువైన బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేసి విద్యార్థులకు అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్నెట్ అవసరం లేకుండానే పాఠ్యాంశాలను విద్యార్థులు చూడొచ్చని అన్నారు. తన పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బహిరంగ సభ వేదికపై కేకును జగన్ కట్ చేశారు. మంత్రులు మేరుగ నాగార్జున, బొత్స సత్యనారాయణ, ఎంపి సురేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీదా మస్తాన్‌రావు, వైసిపి నెల్లూరు, చిత్తూరు, కడప రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్సీ మాధవరావు పాల్గొన్నారు.

# కక్ష సాధింపు మాని సమస్యలు పరిష్కరించండి

• కార్మిక, ఉద్యోగ పోరాటాలకు సిపిఎం మద్దతు
• మీడియా సమావేశంలో శ్రీనివాసరావు, గఫూర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు, ఎంఎ గఫూర్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

కార్మికులు, ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు మానుకుని తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. లేని పక్షంలో శాసన సభ సమావేశాల సందర్భంగా ఆందోళనలకు దిగాల్సిన అనివార్య పరిస్థితులు వారికి ఏర్పడుతాయని తెలిపింది. కార్మికులు, ఉద్యోగులు చేపట్టే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ సోమ, మంగళవారాల్లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతో పాటు ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాలను చర్చించినట్లు చెప్పారు. రాష్ట్ర కమిటీ సమావేశానికి పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, బివి రాఘవులు కూడా హాజరైనట్లు తెలిపారు. లేబర్ కోడ్ల పేర్లతో కార్మికుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఆ చర్యలకు వంతపాడుతోందని చెప్పారు. కార్మికులకు అండగా ఉండాల్సింది పోయి, బిజెపి పాలిత రాష్ట్రాల కన్నా ముందుగా వాటి అమలుకు సిద్ధమౌతోందని విమర్శించారు. ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నవారిపై పోలీసు కేసులు పెట్టడం, అక్రమంగా నిర్బంధించడం, ప్రదర్శనలను అనుమతించకపోవడం వంటి చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం దిగుతోందన్నారు. ప్రభుత్వ దృష్టిలో ధర్నాలు, నిరాహారదీక్షలు కూడా నేరమైపోయాయని అన్నారు. శాంతియుతంగా పౌరులు తమ నిరసనలను తెలిపే హక్కును రాజ్యాంగం గ్యారెంటీ చేసినా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందని, దీనిని తీవ్రంగా మిగతా 5లో

## బైజూస్‌పై తక్షణం విచారణ

ఎనిమిదో తరగతి నుండి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబుల్లో బైజూస్ కంటెంట్ పెట్టి ఇస్తున్నారని, దివాళా తీసిన సంస్థకు సిఎం మార్కెటింగ్ మేనేజర్‌లాగా వ్యవహరిస్తున్నారని వి.శ్రీనివాసరావు విమర్శించారు. బైజూస్ నాణ్యతకు ఎలాంటి సాధికారత లేదని, నిపుణులు నిర్ధారించలేదని అది నాణ్యమైన విద్యనిస్తుందని ఎక్కడా రుజువు కాలేదని చెప్పారు. కంటెంట్ విషయంలో ఎవరి అభిప్రాయాలూ తీసుకోలేదని, నిపుణులతో సంప్రదించలేదని, ఎవరితో సంప్రదించారో ఆ విషయాన్నైనా బయటపెట్టాలని కోరారు. ఎవరితోనూ సంప్రదించకుండా ప్రభుత్వంలో ఉండేవారే దాన్ని నిర్ణయిస్తే అది వ్యాపార సంబంధ లావాదేవీతప్ప విద్యాపరమైన సంబంధం కాదని అన్నారు. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనాన్ని అంగీకరించరాదన్నారు. వందల కోట్ల రూపాయల అమ్మఒడి నిధులను బైజూస్‌కు కట్టబెట్టడం సరికాదని, తక్షణం దీన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


## విజ్ఞానయాత్రలో విషాదం



• బస్సు ప్రమాదంలో ఏడుగురు బాలికల మృతి
• 35మందికి గాయాలు

లోపలి పేజీలో..

## 'ఫుడ్‌ప్యాట్స్'లో భారీ అగ్నిప్రమాదం

• తాడేపల్లి గూడెంలో ఐదుగురు కార్మికులకు గాయాలు
• తెలియరాని మరో కార్మికుని ఆచూకీ




# సమరశీల పోరాటాలకు సన్నద్ధమవ్వాలి

• ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహాసభ పిలుపు
• రాష్ట్ర అధ్యక్షులుగా కె నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కె ఉమామహేశ్వరరావు ఎన్నిక



కె నాగభూషణం



కె ఉమామహేశ్వరరావు

**ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి**

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా కె.నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కె.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతపురం నగరంలోని షిర్డీసాయి కల్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగిన ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభ బుధవారం ముగిసింది. కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధమవ్వాలని తీర్మానించారు. కార్మికులకు ప్రభుత్వమిచ్చిన హామీలను అమలుకు ఐక్యంగా ఉద్యమించాలని నిర్ణయించారు. ఈ మహాసభలో 67 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. వీరిలో 15 మంది కార్యవర్గానికి ఎన్నికయ్యారు. కోశాధికారిగా మిగతా 2లో

## తీర్మానాలు

- శాశ్వత ఉద్యోగులతో సమానంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యోగుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగమివ్వాలి.
- పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు సిబ్బందిని పెంచాలి.
- క్లాప్ డ్రైవర్లకు జిఒ నెంబరు 7 ప్రకారం రూ.18,500 వేతనమివ్వాలి.
- యుటిడి, ఇంజినీరింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ అలవెన్సు ఇవ్వాలి.
- అప్కాస్ వద్దు. తాత్కాలిక ఉద్యోగుల స్థానంలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి.
- స్కిల్డ్, సెమీ స్కిల్డ్ హోదాల వారీగా వేతనాలివ్వాలి.
- ఇతర విభాగాల్లో మాదిరిగా మున్సిపల్ పారిశుధ్య విభాగంలోనూ మహిళలపై లైంగిక వేధింపుల నివారణకు కమిటీలు ఏర్పాటు చేయాలి.

# తెలంగాణకు టిడిపి అవసరం

• రెండు రాష్ట్రాలనూ కలిపేస్తామని కొందరు పనికిమాలిన మాటలు • ఖమ్మం శంఖారావం సభలో చంద్రబాబు

**ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణకు టిడిపి అవసరం ఉందని, ఇక్కడా కూడా పార్టీ బలంగా ఉండాల్సిన అవసరముందని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ మైదానంలో బుధవారం జరిగిన టిడిపి శంఖారావం సభలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా సరిహద్దులోని నాయకన్‌గూడెం నుంచి కార్యకర్తలు ర్యాలీగా ఆయనను తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా సభలో చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విడిపోయినా కలిసి పనిచేస్తే దేశానికే ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కొందరు బుద్ధిలేనివాళ్లు రెండు రాష్ట్రాలనూ కలుపుతామంటున్నారని, జ్ఞానం ఉన్నవాళ్లు ఎవరూ అలా మాట్లాడరని విమర్శించారు. ఎపిలో తప్పిన పాలనను గాడిలో పెట్టి, అక్కడి ప్రజలను ఆదుకుంటానని, కాసాని జ్ఞానేశ్వర్ వంటి నేతలను అభివృద్ధి చేసి తెలంగాణలోనూ టిడిపిని బలోపేతం చేస్తామని అన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు తీసుకొచ్చింది, హైదరాబాదును అభివృద్ధి చేసింది టిడిపియేనని చంద్రబాబు ఉద్ఘాటించారు. తెలంగాణలో ఒక ఎమ్మెల్యేగానీ, ఎమ్మెల్సీగానీ, ఎంపిగానీ లేకపోయినా ఇవాళ ఖమ్మం సభకు



శంఖారావం సభకు హాజరైన ప్రజలు



సభలో శంఖం పూరిస్తున్న చంద్రబాబునాయుడు

తరలివచ్చిన ప్రజలను చూస్తుంటే ఎంతో ధైర్యం కలుగుతోందని పేర్కొన్నారు. 'నన్ను 40 ఏళ్ల ఆశీర్వదించిన తెలుగు జాతి కోసం జీవితాంతం పనిచేస్తాను' అని అన్నారు. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. తన హయాంలో కూడా పలు సంక్షేమ పథకాలు అమలు చేశానన్నారు. టిడిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఖమ్మం తరహాలో తెలంగాణ వ్యాప్తంగా బహిరంగ సభలు నిర్వహిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో సింహగర్జన చేపడతామన్నారు. టిడిపి ఖమ్మం పార్లమెంటరీ నేత కూరపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నందమూరి సుహాషిణి, రాష్ట్ర నాయకులు కంభంపాటి రామ్మోహన్‌రావు, నర్సింహులు, అరవింద్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మేమే కమిటీ వేస్తాం

• రిషికొండపై హైకోర్టు

**ప్రజాశక్తి, అమరావతి**

విశాఖలోని రిషికొండ రిసార్ట్ పునరుద్ధరణ పనుల వివాదంపై తామే ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని హైకోర్టు ప్రకటించింది. పనులు, తవ్వకాల పరిశీలన, సర్వే చేసేందుకు రాష్ట్రానికి చెందిన ముగ్గురు, కేంద్రానికి చెందిన ఇద్దరు అధికారులతో కమిటీ వేయడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. కమిటీలో ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఇద్దరే కేంద్ర అధికారులు ఉండటంపై పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి గత విచారణలో అభ్యంతరం చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరపున డిప్యూటి సొలిసిటర్ జనరల్ ఎన్.హరినాథ్ వాదిస్తూ కమిటీకి ఎంవోఈఎఫ్ నాయకత్వం వహిస్తారని చెప్పారు. స్థానికంగా పూర్తి అవగాహన ఉన్న వారికి కమిటీలో ఆ విధమైన ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. కమిటీలోని వారంతా స్వతంత్రంగా పనిచేస్తారని రాష్ట్ర ప్రభుత్వ లాయర్ చెప్పారు. కమిటీ వల్ల ప్రయోజనం నామమాత్రంగా ఉంటుందని అభిప్రాయపడిన హైకోర్టు తామే కమిటీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేసింది.

# దేశంలో 4 బిఎఫ్-7 కేసులు

• కోవిడ్‌పై కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవీయ సమీక్ష
• అంతర్జాతీయ ప్రయాణికులకు విమానాశ్రయాల్లో పరీక్షలు

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం చైనాను వణికిస్తున్న ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ బిఎఫ్ 7 భారత్‌కూ విస్తరించింది. దేశంలో ఇప్పటి వరకూ నాలుగు బిఎఫ్ 7 కేసులను గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. దేశంలో కోవిడ్ పరిస్థితిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ సీనియర్ అధికారులు, నిపుణులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశంలో తొలి బిఎఫ్7 కేసును అక్టోబర్‌లో గుజరాత్ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ ద్వారా గుర్తించినట్లు అధికారులు ఈ సమావేశంలో తెలిపారు. ఇప్పటి వరకూ మూడు కేసులను గుజరాత్‌లోనూ, ఒక కేసును ఒడిషాలోనూ గుర్తించినట్లు చెప్పారు. అమెరికా, చైనా, ఇంగ్లండ్, యూరోపియన్ దేశాలైన బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, డెన్మార్క్‌తోపాటు ఇతర దేశాల్లోనూ దీనిని గుర్తించారు. చైనాలో బీజింగ్‌సహా అనేక నగరాల్లో బిఎఫ్7 కారణంగానే వైరస్ కేసులు విస్తరిస్తున్నాయి. బీజింగ్‌లో ఉధృతి మరింత అధికంగా ఉంది. చైనా ప్రజలకు గతంలో వచ్చిన ఇన్ఫెక్షన్ కారణంగా తగ్గిన



సమీక్షా సమావేశంలో ఆరోగ్య మంత్రి మాండవీయ

రోగనిరోధక శక్తి, టీకాలు కూడా ప్రస్తుత ఉధృతికి కారణమని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### నిఘాను పటిష్టం చేయండి

ప్రపంచంలో అనేక దేశాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, నిఘాను పటిష్టం చేయాలని మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆదేశించారు. చైనా, ఇతర దేశాల నుంచి వచ్చే ప్రయాణికులందరికీ విమానాశ్రయాల్లో శాంపిల్ టెస్ట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మనదేశంలో కొత్త వేరియంట్ వెలుగుచూసినప్పటికీ కేసుల్లో పెరుగుదల లేదని చెప్పారు. 'నిపుణులు, అధికారులతో పరిస్థితిని సమీక్షించాను. కోవిడ్ ఇంకా ముగియలేదు. అప్రమత్తంగా ఉండాలని, నిఘాను పటిష్టం చేయాలని సంబంధింత అధికారులందర్నీ ఆదేశించాను. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం' అని మంత్రి సమావేశం అనంతరం ట్వీట్ చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఆయుష్ శాఖలకు చెందిన కార్యదర్శులు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహ్ల్, నీతి ఆయోగ్ సభ్యులు (ఆరోగ్యం) డాక్టర్ వికె పాల్, నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ ఆన్ ఇమ్యునైజేషన్ (ఎన్‌టిఎజిఇఐ) చైర్మన్ డాక్టర్ ఎన్‌కె అరోరా, ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ దేశాల్లో కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మంగళవారమే రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేష్ భూషణ్ లేఖ రాశారు. కోవిడ్ 19 ప్రికాషనరీ డోస్‌ను దేశ జనాభాలో 27 శాతం నుంచి 28 శాతం మందే తీసుకున్నారని నీతి ఆయోగ్ (ఆరోగ్యం) సభ్యులు వికె పాల్ పేర్కొన్నారు. అందరూ కోవిడ్ డోస్ తీసుకోవాలని, రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని సూచించారు.

# ఆఫ్ఘన్ వర్శిటీల్లో మహిళలకు విద్య నిషేధం

**కాబూల్ :** ఆఫ్ఘనిస్థాన్‌లోని యూనివర్శిటీల్లో మహిళలకు విద్యను నిషేధిస్తూ తాలిబన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ, ప్రయివేటు యూనివర్శిటీల్లో మహిళలకు విద్యాబోధనను వెంటనే నిలిపివేయాలని ఉన్నత విద్యాశాఖ మంత్రి నేదా మహమ్మద్ నదీమ్ లేఖ రాశారు. విద్యా మంత్రిత్వ శాఖ ప్రతినిధి జియావుల్లా హష్మీ ఈ లేఖను ధ్రువీకరిస్తూ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా వేలాది మంది బాలికలు, మహిళలు విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలకు హాజరైన మూడు నెలల అనంతరం ఈ నిషేధం విధించడం గమనార్హం. మహిళల, మైనారిటీల హక్కులను పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చిన సమయంలో తాలిబన్లు ప్రకటించినప్పటికీ, అందుకు భిన్నంగా పాలన సాగిస్తోంది. మహిళలు బహిరంగ ప్రదేశాల్లో తల నుంచి కాలి వరకూ దుస్తులు ధరించాలని, పురుషులు వెంట లేకుండా ఇళ్ల నుంచి బయటకు రావడానికి వీల్లేదని ఇప్పటికే ఆంక్షలను విధించింది. బాలికల సెకండరీ స్కూళ్లు, హైస్కూళ్లు మూసివేసింది. ఉద్యోగాల నుంచి చాలా వరకూ తొలగించింది. విద్యపై నిషేధం విధించడం.. మహిళల, బాలికల హక్కులను ఉల్లంఘించడమే కాకుండా దేశ భవిష్యత్తుపై వినాశకరమైన ప్రభావం చూపుతుందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు.

# కోర్సుల పేరుతో తల్లిదండ్రులను బెదిరిస్తారా?

• బైజూస్‌పై ఎన్‌సిపిసిఆర్ ఆగ్రహం
• సిఇఒ రవీంద్రన్‌కు నోటీసులు




**న్యూఢిల్లీ :** పిల్లలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను అక్రమంగా కొనుగోలు చేసి, కోర్సుల పేరుతో వారి తల్లిదండ్రులను ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ బెదిరిస్తోందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సిపిసిఆర్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "పిల్లలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్‌లను బైజూస్ కొనుగోలు చేయడంతో పాటు తమ కోర్సులను కొనుగోలు చేయకపోతే విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని బెదిరిస్తోందని మాకు తెలిసింది. వారు ప్రాథమిక విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. దీనిపై మేము చర్యలను ప్రారంభిస్తాం. అవసరమైతే కేంద్రానికి ఓ నివేదికను తయారు చేసి పంపిస్తాం" అని ఎన్‌సిపిసిఆర్ చీఫ్ ప్రియాంక కనుంగో ఎఎన్‌ఐ వార్త సంస్థకు తెలిపారు. ఈ విషయమై డిసెంబర్ 23న తమ ముందు హాజరు కావాలని బైజూస్ వ్యవస్థాపకులు, సిఇఒ రవీంద్రన్‌కు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఒత్తిడి చేసి కోర్సులను కొనుగోలు చేయించడం, నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ నెంబర్లను సంపాదించడం లాంటి అతిక్రమణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించామన్నారు. బైజూస్ సంస్థ రుణ ప్రాతిపదికన సైతం తల్లిదండ్రులతో ఒప్పందాలు చేసుకుంటోందని తెలిపారు. ఎవరైనా తిరిగి తమ మొత్తాన్ని ఇవ్వాలని, ఈ ఒప్పందం నుంచి వెనక్కువెళ్లిపోతామని కోరినా అంగీకరించకుండా వేధింపులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. బైజూస్‌పై చాలా ఫిర్యాదులు అందాయని తెలిపారు. తాము దోపిడీకి గురయ్యామని, మోసపోయామని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. లాక్‌డౌన్ కాలంలో విస్తృత ప్రాచుర్యం పొందిన బైజూస్ సంస్థ పాల్పడుతున్న అక్రమాలు తాజాగా వెలుగుచూడటం గమనార్హం. మనరాష్ట్రంసహా పలు ప్రభుత్వాలు బైజూస్‌ను ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే.

# 'ఫుడ్‌ప్యాట్స్'లో భారీ అగ్నిప్రమాదం

- తాడేపల్లిగూడెంలో ఐదుగురు కార్మికులకు గాయాలు
- తెలియరాని మరో కార్మికుని ఆచూకీ

**ప్రజాశక్తి- తాడేపల్లిగూడెం, ఉంగుటూరు**

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ శివార్లలోని పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామ పరిధిలోగల ఫుడ్‌ప్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ (ఎఫ్‌ఎఫ్‌ఎఫ్) ఫ్యాక్టరీలో ఎస్‌ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఐదుగురు కార్మికులకు గాయాలవ్వగా, మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. దీనికి సంబంధించి ఎఫ్‌ఎఫ్‌ఎఫ్ మేనేజర్ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాల్వెంట్ ప్లాంటులో కార్మికులు మూడు షిఫ్టులుగా పని చేస్తారు. ఎస్‌ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పేలుడు సంభవించి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. మధ్యాహ్నం షిఫ్టులో విధులో ఉన్న తాడేపల్లిగూడేనికి చెందిన చరణ్ (32), అలంపురానికి చెందిన తాళ్లూరి దుర్గాప్రసాద్ (30), తణుకుకు చెందిన కోన నాగబాబు (41), జగన్నాథపురానికి చెందిన గడ్డం బాబ్జి (32), జార్కండ్‌కు చెందిన సునీల్‌కుమార్ గాయాలపాలయ్యారు. వీరిని తాడేపల్లిగూడెంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన చరణ్, దుర్గాప్రసాద్ పరిస్థితి ఆందోళనకరంగా



ప్రమాదంలో దగ్ధమైన ప్లాంట్

ఉంది. దీంతో, వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి తరలించారు. కుంచనపల్లికి మల్లికార్జునరావు ఆచూకీ తెలియాల్సి ఉంది. అదే ప్లాంట్లో ఇన్సులిన్ పని చేస్తున్న ఏడుగురు కార్మికులు పేలుడు సమయానికి కొన్ని నిమిషాల ముందు టీ తాగేందుకు వెళ్లడంతో వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. మంటలు ఉవ్వెత్తున ఎగసి పడడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తాడేపల్లిగూడెం ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సంఘటనా స్థలాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఆర్‌డిఒ దాసి రాజు, పరిశ్రమల తనిఖీ అధికారులు పరిశీలించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతోపాటు కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ప్రమాదం విషయాన్ని తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి కారుమూరి చెప్పారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం సంభవించిన ప్లాంట్‌ను తాత్కాలికంగా సీజ్ చేశామని ఎస్‌పి తెలిపారు. రాత్రి సమయం కావడంతో లోపల పరిస్థితిని పరిశీలించే అవకాశం లేదని, సంబంధిత శాఖల అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి గురువారం ప్లాంట్ తెరిచి గల్లంతైన కార్మికుని గురించి, ఇతర అంశాలు పరిశీలిస్తామని చెప్పారు.

**కార్మికుడి ఆచూకీ త్వరగా తెలియజేయాలి : సిఐటియు**

సంఘటనా స్థలాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యంతోనూ, అధికారులతోనూ చర్చించారు. ఆచూకీ తెలియని కార్మికుని గురించి వీలైనంత త్వరగా తెలియజేయాలని, గాయాలైన కార్మికులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

## ఎస్‌ఐ కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆనారోగ్యంతో చిన్న వయస్సులోనే మృతిచెందిన సహచరుడు నాగరాజు కుటుంబం కోసం సెబ్ అధికారులు, ఉద్యోగుల నుండి సమీకరించిన రూ 6.5 లక్షల చెక్‌ను స్పెషల్ సిఎస్ రజత్‌భార్గవ, ఎక్సైజ్ కమిషనర్ వివేక్‌యాదవ్ ఎపి స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎమ్‌డి వాసుదేవరెడ్డి ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. నాగరాజు సతీమణికి కారుణ్య నియమకాల కింద ఉద్యోగం ఇవ్వాలని ఉద్యోగుల సంఘం నాయకులు బి నరసింహులు ఈ సందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేశారు. సెబ్ విభాగంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రజత్‌భార్గవ తెలిపారు.

## ఖాళీ స్థలాలకు పన్ను చట్ట విరుద్ధం

- తక్షణమే నిలిపివేయాలి : ఎపియుసిఎఫ్ డిమాండ్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాజమండ్రిలో ఖాళీ స్థలాల పన్ను చెల్లించకపోతే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని, సచివాలయాలు ఇతర నిర్మాణాలు చేపడతామని బెదిరిస్తూ అధికారులు నోటీసు బోర్డులు పెట్టడం చట్ట విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ పట్టణ పౌర సమాఖ్య (ఎపియుసిఎఫ్) కన్వీనర్ సిహెచ్ బాబూరావు తెలిపారు. ఈ బోర్డులు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీ స్థలాల పన్ను భారం ప్రజలపై తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 300 చదరపు గజాల లోపు ఖాళీలు ఉన్న పేద, మధ్య తరగతి ప్రజలందరికీ విఎల్‌టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయి పట్టణ ప్రజలపై తీవ్రమైన భారాలు మోపుతుందని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌ను 40 శాతం నిధులను స్థానిక సంస్థలకు బదలాయించాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మరోవైపు ఆస్తిపన్ను ఆస్తివిలువ ఆధారంగా పెంచేస్తున్నారని, మంచినీటికి, డ్రైనేజీకి రేట్లు నిర్ణయించి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ వ్యక్తుల మాదిరిగా ప్రభుత్వమే దౌర్జన్యాలకు పాల్పడి చట్ట విరుద్ధమైన చర్యలకు పూనుకోవటం శోచనీయమని తెలిపారు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహించాల్సిన ప్రభుత్వాలే, ఇల్లు కట్టుకోలేని ఖాళీ స్థలాలపై భారీగా పన్నులు వేయటం సరికాదని తెలిపారు.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,**
**ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,**
**అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,**
**గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
**editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## 14 వేలకు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు ఇంటర్నెట్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా 14 వేలకు పైగా జనాభా ఉన్న ప్రతి గ్రామంలోని చిట్టచివరి ఇంటికి కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని ఎపిఎస్‌ఎఫ్ఎల్ ఛైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. విజయవాడ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లోని ఎపిఎస్‌ఎఫ్ఎల్ కార్యాలయంలో బుధవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌతంరెడ్డి మాట్లాడారు. నెలకు రూ.190కే 20ఎంబిపిఎస్ స్పీడ్, 400జిబి ఎఫ్‌యుపి, 2 ఎంబిపిఎస్ పెస్ట్ పియుపి సౌకర్యం కల్పించడంతో పాటు వినియోగదారునికి ఎటువంటి ఆర్థిక భారం లేకుండా సెటప్ బాక్సును ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నెలకు రూ.249 ప్యాకేజీలో 50 ఎంబిపిఎస్ స్పీడ్‌తో 600 జిబి ఎఫ్‌యుపి, 2 ఎంబిపిఎస్ ఎఫ్‌యుపి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇవన్నీ రానున్న పది పదిహేను రోజుల్లో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నట్లు గౌతంరెడ్డి తెలిపారు.

## సమరశీల పోరాటాలకు సన్నద్ధమవ్వాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ఎస్.జ్యోతిబసు, ఉపాధ్యక్షులుగా కె.సామ్రాజ్యం (ప్రకాశం), డేవిడ్ (ఎన్‌టిఆర్ జిల్లా), సోమయ్య (ఏలూరు), నూకరాజు, ఇందిర, నూకరాజు, ఎంవి.ప్రసాదరావు (విశాఖ), కార్యదర్శులుగా ఎన్‌వి నాయుడు (పార్వతీపురం మన్యం), ముత్యాలరావు (గుంటూరు), కె.పెంచుల నరసయ్య (నెల్లూరు), ఉరుకూటి రాజ (విశాఖ), ఎం.రామలక్ష్మి (సెంటర్) ఎన్నికయ్యారు. కోఆప్షన్‌గా వైఎస్ఆర్ జిల్లా నుంచి ఒకరిని ఎన్నుకున్నారు. రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను మహాసభలో రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలుకు ఇతర కార్మిక సంఘాలతో కలిసి పోరాడాలని నిర్ణయించారు. ఎనిమిది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

## ఇట్టినా భూములు కొన్నది వాస్తవమే

- మార్కెట్ ధరకు రైతులకిస్తాం : మంత్రి గుమ్మనూరు
- అప్పుడు కంపెనీకి అమ్మిన ధరకే ఇవ్వాలని రైతులు, సిపిఎం డిమాండ్

**ప్రజాశక్తి-ఆస్పరి (కర్నూలు)**

ఇట్టినా ప్లాంటేషన్‌కు రైతులు అమ్మిన 450 ఎకరాల భూమిలో వందెకరాలు కొన్నది వాస్తవమేనని కార్మిక ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఎట్టకేలకు అంగీకరించారు. రైతులకు మార్కెట్ ధర ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని చెప్పారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండల కేంద్రంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఆస్పరి చౌరస్తాలో రూ.65 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు సొసైటీ ఛైర్మన్ కట్టెల గోవర్ధన, సిసిఒ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తా నుండి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కలుస్తూ ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సర్పంచి మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి రక్తదాన శిబిరం నిర్వహించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

**అమ్మిన ధరకే భూములు ఇవ్వాలి : సిపిఎం**

ఇట్టిన సంస్థకు అమ్మిన ప్రకారం రూ.21 వేలు తీసుకొని రైతుల భూములను వారికే ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు బాలకృష్ణ, రంగస్వామి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఇట్టిన సంస్థకు భూములు అమ్మిన బాధిత రైతులు.. సిపిఎం ఆధ్వర్యంలో మంత్రి గుమ్మనూర్ జయరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములు తమకే ఇవ్వాలని, భూముల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని రైతులు మహానంది, రామకృష్ణ, బలరాం, పరిశప్ప, మానంది కోరారు.

## కోవిడ్ కొత్త వేరియంట్‌పై భయం వద్దు

**ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్**

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

కోవిడ్ కొత్త వేరియంట్ కేసులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగానే వుందని ఎవరూ ఆందోళన చెందవద్దని ఎపి వైద్యఆరోగ్యశాఖ ప్రకటించింది. కోవిడ్ అంశంలో నిరంతర పర్యవేక్షణ నడుస్తోందని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జె నివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నవంబర్ నెల నుండి దాదాపు 30 వేల శ్యాంపిళ్లను పరీక్షించగా 130 పాజిటివ్ కేసులొచ్చాయని తెలిపారు. ఆ పాజిటివ్ కేసు లు ఒమిక్రాన్ తప్ప కొత్త వేరియంట్ కేసులు ఏవిలేవన్నారు. జీనోమ్ సీక్వెన్సింగ్ టెస్ట్‌కు ఏర్పాట్లు చేశామని ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 29 ల్యాబ్‌లు అందుబాటులో వున్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సీజన్, ఐసియు బెడ్లు సిద్ధంగా వుంచామని పేర్కొన్నారు. అలాగే ర్యాపిడ్ టెస్టింగ్ కిట్లు, మందులు కూడా అందుబాటులో వున్నాయని, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లలో నిరంతర పర్యవేక్షణ వుంచామని తెలిపారు.

## జనవరి 26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్స్ నిషేధం : నీరబ్ కుమార్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో ప్లాస్టిక్ బ్యానర్స్‌పై జనవరి 26 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ చెప్పారు. 'ప్రత్యామ్యాయ ప్లాస్టిక్ బ్యానర్స్' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఎపిసిబి) ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను బుధవారం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరబ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యానర్ల ప్రింటర్లకు ప్రత్యామ్నాయంగా యంత్రాల మార్పునకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఎపిసిబి సభ్య కార్యదర్శి, మున్సిపల్ శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవాళి మనుగడకు కలిగే నష్టం పెద్దస్థాయిలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ సుజన తదితరులు పాల్గొన్నారు.

## 23, 24 తేదీల్లో ప్రపంచ తెలుగు మహాసభలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

భాష, సంస్కృతి, దేశీయ కళలు, సాహిత్యం, చరిత్ర అధ్యయనాల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించేందుకు ఐదవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్నట్లు ప్రపంచ తెలుగు రచయితల మహాసభ గౌరవాధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచందు పేర్కొన్నారు. ప్రపంచ తెలుగు రయితల మహాసభలను ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా ప్రపంచ సాహిత్యవేదిక, సిలికానాంధ్ర, సిద్ధార్థ అకాడమీ, కృష్ణ జిల్లా రచయితల సంఘం సహకారంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మహాసభల ఏర్పాట్లు కార్యక్రమ షెడ్యూల్‌ను వివరించేందుకు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సిద్దార్థ అకాడమీ (రాజరాజనరేంద్రుడి ప్రాంగణం)లో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న ఉదయం 10 గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ప్రారంభిస్తారని, అదే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మండలి బుద్ధ ప్రసాద్

రోజు సాయంత్రం నాలుగు గంటలకు తెలుగు వెలుగుల సభలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభకు ప్రపంచ వ్యాప్తంగా 1500 మంది రచయితలు పాల్గొంటారని తెలిపారు. ఆదికవి నన్నయ్య వేదికపై ప్రారంభసభ, తెలుగు వెలుగుల సభ, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు వేదికపైన కవి సమ్మేళనాలు జరుగుతాయన్నారు. ఎన్‌టిఆర్ వేదికపై సాహితీ సదస్సులు జరుగుతాయని తెలిపారు. మీడియా సమావేశంలో కృష్ణకిషోర్, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు చలపతిరావు పాల్గొన్నారు.

## మోడల్ బైలాస్ మేరకే హెచ్‌ఎఎ ఎన్నికలు

**ప్రజాశక్తి, అమరావతి**





మోడల్ బైలాస్ ప్రకారమే ఎపి హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఎపిహెచ్‌ఎఎ) ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేశామని ప్రస్తుత కార్యవర్గం హైకోర్టుకు తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను శాంతియుతంగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల అంశంపై ప్రస్తుత కార్యవర్గం స్పష్టత ఇచ్చిన కారణంగా ఈ వివాదంపై విచారణ అవసరం లేదని స్పష్టం చేసింది. విచారణను మూసేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య డివిజన్ బెంచ్ బుధవారం ప్రకటించింది. కార్యవర్గ కాలపరిమితి పూర్తి అయినప్పటికీ బార్ కౌన్సిల్ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం లేదని లాయర్ ఎన్.విజయభాస్కర్ వేసిన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది.



## మాచర్ల ఘటనపై చర్యలు తీసుకోవాలి

- గవర్నర్‌కు టిడిపి ఫిర్యాదు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

మాచర్లలో జరిగిన దాడిపై టిడిపి నాయకులు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు జివి ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. మాచర్లలో తమ పార్టీ కార్యాలయం, వాహనాలు తగులబెట్టారని, ఇళ్లను ధ్వంసం చేశారని తెలిపారు. ఇప్పటి వరకు ఒక్కరినీ కూడా అరెస్టు చేయలేదని విమర్శించారు. టిడిపి శ్రేణులపై దాడి చేస్తున్నా పోలీసులు చూస్తున్నారే తప్పితే నిలువరించలేదన్నారు. మాచర్ల ఘటనపై సిఎం చర్యలు తీసుకోకపోతే తాడేపల్లి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. జగన్ పుట్టిన రోజు నరసరావుపేటలో ఇబ్రహీంని హత్య చేశారని పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీమంత్రులు నక్కా ఆనంద్ బాబు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, నాయకులు బుచ్చిరామ్ ప్రసాద్ ఉన్నారు.

## ఇబ్రహీం హత్య అత్యంత కిరాతకం : చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

నరసరావుపేటలో టిడిపి ముస్లిం నేత షేక్ ఇబ్రహీం హత్య అత్యంత కిరాతక చర్యని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. పల్నాడులో శాంతిభద్రతల దుస్థితికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేకు బుధవారం ప్రకటనలో విడుదల చేశారు. పల్నాడును ఏం చేయాలనుకుంటున్నారో, ఈ హత్యాకాండ ఎందుకో సిఎం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పల్నాడు జిల్లా అసమర్థ ఎస్‌పిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**పల్నాడును వల్లకాడు చేశారు : అచ్చెన్నాయుడు**

వైసిపి ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పల్నాడును వల్లకాడు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాచర్లలో మొన్నటి విధ్వంసం మరువక ముందే పల్నాడులో మరో ముస్లిం కార్యకర్తను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. దాడికి పాల్పడ్డ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అణుచరుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించాలి : కెవిపిఎస్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

రాష్ట్రంలో వైద్యఆరోగ్య శాఖలోని ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేసే ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటి కృష్ణబాబుకు వినతి అందజేశారు. ఆరోగ్యమిత్రలుగా ఎక్కువగా పేద దళిత కుటుంబాలనుండి వచ్చిన వారు వున్నారని వివరించారు. 15ఏళ్లుగా పనిచేస్తున్న వీరికి ఉద్యోగభద్రత, కనీసవేతనాలు అమలు కావడంలేదని వివరించారు. ఆరోగ్య మిత్రలను కూడా క్లాస్3 ఉద్యోగులుగా గుర్తించి పదోన్నతులకు అవకాశం కల్పించాలని కోరారు. కనీస వేతనంగా రూ 21వేలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ పథకాలను వర్తింపజేయాలని కోరారు. అలాగే కర్నూలు మండలం పసుపుల గ్రామంలో పదేళ్లగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న దళితులపై స్థానిక పెత్తందారులు దాడులు చేసి గుడిసెలు కూల్చివేసిన కేసులో చర్యలు తీసుకోవాలంటూ కెవిపిఎస్ నేతలు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌కు మరో వినతి పత్రం అందజేశారు. పసుపుల గ్రామంలో అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం ఎంపిటిసి సభ్యులు మురళీకృష్ణ ఈ స్థలం నాది అంటూ దౌర్జన్యం చేస్తున్నారని వివరించారు. తక్షణం జోక్యం చేసుకొని పసుపుల గ్రామంలోని పేదలకు ఇళ్లస్థలాకు పట్టాలను అందించి న్యాయం చేయాలని కోరారు.

## ప్రభుత్వ ప్రకటనల పేరుతో దోపిడీ : యనమల

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ప్రకటనల పేరుతో కొనసాగుతున్న దోపిడీని ఆపివేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రకటనల జారీలో సుప్రీంకోర్టు జారీచేసిన విధివిధానాలను ఉల్లంఘించి జగన్ అక్రమ ఆర్జనకు పాల్పడ్డారని ఆయన బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ ప్రకటనలను వ్యక్తిగత ఇమేజీ పెంచుకోవడానికి, వైసిపి ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసుకున్నారని విమర్శించారు. కేవలం తన పుట్టినరోజు పేరుతో రూ.50 కోట్లు జేబులో వేసుకోవడం దారుణమన్నారు. జీతాలు కూడా ఇవ్వలేని, రైతులు ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయలేని అస్తవ్యస్త రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో సొంత జేబులు నింపుకోవడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని వాడుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**దివాళా సంస్థ బైజూస్ : పట్టాభి**

అప్పులు చేసి, ఎగనామం పెట్టిన దివాళా సంస్థ బైజూస్‌ను దేనికోసం సిఎం జగన్ రాష్ట్రానికి ఆహ్వానించారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. 1.2 బిలియన్ డాలర్ల అప్పు ఎగ్గొట్టిందని రుణదాతలు ఆ సంస్థను ఒత్తిడిచేస్తున్నారని జాతీయ ఆంగ్ల దినపత్రికలో రాశారని బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. బైజూస్‌పై నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్)కు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇలాంటి సంస్థతో సిఎం జగన్ చేతులు కలిపారని విమర్శించారు.

## మోడీ విధానాలపై పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

**ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ**





లాభాల దిశగా పయనిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండడం దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 678వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-1 విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు టి.సత్యనారాయణ, జివి.సుబ్బయ్య, మొదలవలస వెంకటరమణ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు యత్నిస్తోన్న ప్రధాని నరేంద్ర మోడీ విధానాలను ఎండగడతామన్నారు. త్యాగాల ఫలితంగా ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితిల్లో ప్రయివేటుపరం కానివ్వబోమని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ దీక్షల్లో పివి.రమణమూర్తి, దాసరి శ్రీనివాస్, కార్మిక నేతలు, కార్మికులు కూర్చున్నారు.



క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సిఎం వైఎస్ జగన్

## ఘనంగా సిఎం జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు రాష్ట్రంలో ఘనంగా జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి కార్యాలయాలతో పాటు పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులు, మంత్రులు, ఉన్నతాధికారుల మధ్య సిఎం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి, జోగి రమేష్, తానేటి వనిత, విడుదల రజని, రోజా, సిఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజి సిఎస్ డాక్టర్ సమీర్‌శర్మ, సిఎం తల్లి వైఎస్ విజయమ్మ, బాబాయ్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, సతీమణి వైఎస్ భారతీ ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో**

తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వమత ప్రార్థనలతో 500 కిలోల కేక్‌ను పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకష్ణారెడ్డి, మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, లక్ష్మీపార్వతి, వాసిరెడ్డి పద్మ, తెలుగుబాషా సంఘం చైర్మన్ విజయ్‌బాబు కేక్‌ను కట్‌చేశారు.

**రికార్డుస్థాయిలో రక్తదానం**

జగన్ జన్మదినం సందర్భంగా వైసిపి శ్రేణులు, అభిమానులు మొత్తం 1,29,451 మంది రక్తదానం చేసి జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. ఈ మేరకు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి వీరేంద్ర రికార్డు ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను పార్టీ ప్రధానకార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సజ్జల రామకష్ణారెడ్డి మాట్లాడుతూ జగన్ వెంట ప్రజలు వున్నారనేందుకు రక్తదాన కార్యక్రమం మరోసారి నిరూపించిందన్నారు.

## పరిశీలనలోనే విశాఖ రైల్వే జోన్

- ఆర్‌టిఐ ప్రశ్నకు కేంద్రం సమాధానం

**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

విశాఖలో ఏర్పాటు చేయాల్సిన రైల్వే జోన్‌పై కేంద్రం ఇంకా దాగుడుమూతలు ఇంకా కొనసాగుతున్నాయి. . తాజాగా సమాచార హక్కు కార్యకర్త ఇనగంటి రవికుమార్ అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం నుంచి అటువంటి సమాధానమే వచ్చింది. జోన్ ఏర్పాటు ప్రక్రియ ఇంకా పరిశీలనలోనే ఉందని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈ సమాధానంలో పేర్కొంది. విశాఖ పేరును ప్రస్తావించకుండానే సౌత్‌కోస్ట్ రైల్వే జోన్ ప్రతిపాదన పరిశీలన స్థాయిలోనే ఉందని, దీనికి సంబంధించిన డిపిఆర్ కూడా పరిశీలనలోనే ఉందని పేర్కొంది. దీని ఏర్పాటుకు సంబంధించి కాలపరిమితి కూడా ఏమీ లేదని తెలిపింది. రాయగడ డివిజన్ ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలోకే వస్తుందని స్పష్టం చేయడంతో పాటు సౌత్‌కోస్ట్ జోన్, రాయగడ డివిజన్‌లను కలిపి అంబ్రెల్లా నెట్‌వర్క్‌గా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని తెలిపింది. జోన్ ఏర్పాటుకు ప్రధాన కేంద్రానికి గత నెల్లోనే 106.89 కోట్లు కేటాయించినట్లు పేర్కొంది. అయితే ఆ ప్రధాన కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారన్న విషయాన్ని మాత్రం ప్రస్తావించలేదు. దీనికి 2022-23 బడ్జెట్‌లో రూ. 40 లక్షలు విడుదల చేస్తే ఆరు లక్షలు వ్యయం చేసినట్లు పేర్కొంది. తెలంగాణలోని కాజీపేట్‌లో కొత్త డివిజన్ ఏర్పాటు ప్రతిపాదన కూడా లేదని తేల్చిచెప్పింది.

## నిలిపివేసిన పథకాలను పునరుద్ధరించాలి

- గవర్నర్‌కు దళిత, గిరిజన జెఎసి వినతి

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

దళితులకు, గిరిజనులకు ఉద్దేశించిన 27 సంక్షేమ అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని దళిత, గిరిజన జెఎసి ఛైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి గోపాలరావు, దళిత, బహుజన ఫ్రంట్‌జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు పేర్కొన్నారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను బుధవారం దళిత,గిరిజన జెఎసి ప్రతినిధుల బృందం కలిసింది.. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలకున్న ప్రత్యేక హక్కుల సక్రమ అమలుకు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. రాజ్యాంగ బద్ధ హక్కులను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. 2023 జనవరిలో ముగియనున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని కాలపరిమితితో సంబంధం లేకుండా ఎస్‌సి, ఎస్‌టిల సమగ్రాభివృద్ధి నిధి చట్టంగా మార్చాలని కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విదేశీ విద్యోన్నతి పేరుతో ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్య కోసం సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఏజెన్సీ ఏరియాలో జిఓ ఎంఎస్ నెంబరు 3ని పునరుద్ధరించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, 1/70 చట్టాన్ని ఎఫ్‌ఆర్‌ఎ చట్టాన్ని పీసా చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రిటైర్డ్ ఐఆర్‌టిఎస్ అధికారి పనబాక కృష్ణయ్య , దళిత బహుజన ఫ్రంట్ జాతీయ నేతలు కొరివి వినయ్‌కుమార్, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారులు ఉప్పులేటి దేవీ ప్రసాద్, ఎం. రాణా ప్రతాప్ ఉన్నారు.

## ప్రజాశక్తి మోపిదేవి విలేకరి మృతి

- నివాళులర్పించిన సిజిఎం

**ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి**



కృష్ణాజిల్లా మోపిదేవి మండలం ప్రజాశక్తి విలేకరి కోసూరు పాంచజన్య (58) గుండెపోటుతో బుధవారం మృతిచెందారు. ఆయన స్వగ్రామైన కోసూరి వారిపాలెంలో సాయంకాలం అంత్యక్రియలు నిర్వహిం చారు. మోపిదేవిలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల కార్యక్రమం వార్త సేకరణ కోసం వెళ్లిన ఆయన అక్కడే కుప్పకూలిపోయారు. తోటి పాత్రికేయులు గమనించి అవనిగడ్డ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య రాజేశ్వరి, కుమారుడు చిట్టిబాబు ఉన్నారు. భౌతికకాయాన్ని ప్రజాశక్తి సిజిఎం వై.అచ్యుతరావు, విజయవాడ ఎడిషన్ మేనేజర్ శివరామకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పాంచజన్య మృతిపట్ల ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు తీవ్ర సంతాపం తెలిపారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**ప్రజాశక్తి-ఉరవకొండ**

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం డొనేకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. డొనేకల్లు గ్రామానికి చెందిన యాలిపి గాదిలింగ (47) రెండెకరాలు కౌలుకు తీసుకుని రెండేళ్లుగా మిరప పంట సాగుచేస్తున్నారు. పంటకు తెగుళ్లు సోకడంతో తీవ్రంగా నష్టపోయారు. పంట పెట్టుబడి, ఎరువులు, మందుల కోసం దాదాపు రూ.మూడు లక్షల వరకు అప్పుచేశారు. వాటిని ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యేవారు. రుణదాతల వేధింపులు అధికం కావడంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. గాదిలింగకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మళ్లీ వెంకట్రామిరెడ్డే

- సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా రెండోసారి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కె వెంకట్రామిరెడ్డి మరోసారి గెలుపొందారు. బుధవారం అర్ధరాత్రి వరకు ఫలితాల లెక్కింపు ఉత్కంఠగా సాగింది. యువజన సర్వీసుల శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి అధ్యక్ష పదవికి పోటీపడగా వెంకట్రామిరెడ్డి 368 ఓట్లతో గెలుపొందారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పి శ్రీకృష్ణ గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా సిహెచ్ ఎర్రన్న యాదవ్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సత్య సులోచన, అడిషనల్ సెక్రటరీగా వి గోపికృష్ణ గెలుపొందారు.సంయుక్త కార్యదర్శులుగా యు మనోహర్(ఆర్గనైజింగ్),రమాదేవిరెడ్డి(మహిళా), ఎ సాయికుమార్(ఆటలు), ట్రెజరర్‌గా కె వెంకట్రావు గెలుపొందారు.

## శ్రీకాళహస్తిలో తంత్ర వైద్యుడు దారుణ హత్య

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

శ్రీకాళహస్తిలోని కైలాసగిరి కాలనీలో చంద్రయ్య ఆచారి (56) అనే తంత్ర వైద్యుడు దారుణహత్యకు గురయ్యారు. వైద్యం కోసం వచ్చినవారే ఇలా చేసి ఉండవచ్చన్న అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయుడుపేట సమీపంలోని పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగార్జునరెడ్డిని అనుమతుడిగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# యడవల్లి భూములను దున్నిన దళిత రైతులు

## ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్

**ప్రజాశక్తి - చిలకలూరిపేట, పల్నాడు జిల్లా**


ఎర్ర జెండాలతో సాగుకు దిగిన దళిత రైతులు

గుంటూరు జిల్లా చిలకలూరిపేట రూరల్ గ్రామం యడవల్లిలో దళిత రైతులు భూసాగు చేపట్టారు. రైతులు కాకాని రోజ్‌మేరెమ్మ, వెంకట్రావుతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు దుక్కి దున్ని జొన్న విత్తనాలు చల్లారు. అనంతరం భూముల్లో ఎర్రజెండాలు పాతారు. దళిత భూ బాధితులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడారు. 250 మంది దళితులకు 416 ఎకరాల భూములను 1975లో అప్పటి జిల్లా కలెక్టర్ కత్తి చంద్రయ్య పంపిణీ చేశారని తెలిపారు. మైనింగ్ పేరుతో యడవల్లి దళితుల భూములను కాజేయాలని టిడిపి ప్రభుత్వం ప్రయత్నిస్తే.. మీకు అండగా ఉంటామని, అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చిలకలూరిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని నెరవేర్చకపోగా నేడు వైసిపి నేతలే భూములు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ పేరుతో దళితుల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనుకుంటే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మూడు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై రాధాకృష్ణ, వ్యకాస, కెవిపిఎస్, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు

## 108 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

- 15 తర్వాత నిరవధిక సమ్మె

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ**

108 వాహనాల్లో విధులు నిర్వహిస్తోన్న ఇఎంటి, పైలట్‌లును కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జోనల్ సమావేశంలో డిమాండ్ చేసింది. . ఈ సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 15 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని తీర్మానించింది.. విశాఖపట్నం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా కోశాధికారి ఎస్ జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ టిఎంటి, పైలట్‌లకు సర్వీసును బట్టి వెయిటేజీ మార్కులు ఇవ్వాలని, వీరిని వైద్య, ఆరోగ్య శాఖలో ఏర్పడే ఖాళీలలో నియమించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ 108 సిబ్బంది జీతాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచినప్పటికీ, 108 నిర్వహణ సంస్థ నెల, నెలా జీతాలను చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ఆ సంస్థ అధికారుల వేధింపుల కారణంగా ఉద్యోగ భద్రతకు ముప్పు ఏర్పడిందని తెలిపారు. చిన్న చిన్న కారణాలతో డివిజన్, డిస్ట్రిక్ట్ బదిలీలు, సస్పెన్షన్లు, టెర్మినేషన్‌నూ చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో జరిగిన అగ్రిమెంట్ అమలులోనూ జాప్యం చేస్తున్నారని తెలిపారు. గతంలో ఈ సంస్థను నిర్వహించిన అరబిందో సంస్థలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లో తీసుకోవాలని, నెల జీతం ఇఎంటిలకు రూ.30 వేలు, పైలట్‌లకు రూ.28 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారుఈ సమావేశంలో కోటేశ్వరరావు (గౌరవాధ్యక్షులు), బి శ్రీనివాస్ (విశాఖపట్నం), బంగారురాజు (విజయనగరం), విజయమోహన్ (శ్రీకాకుళం), ఎంఎస్ఎన్ శ్రీనివాస్ (తూర్పుగోదావరి) పాల్గొన్నారు.

## 2024లో వైసిపికి సింగిల్ డిజిట్

- మాజీ మంత్రి డిఎల్. రవీంద్రారెడ్డి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వైసిపికి ఈసారి సింగిల్ డిజిట్ వస్తే గొప్పే అని మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని చంద్రబాబు తప్ప మరో నేత కాపాడలేరని పేర్కొన్నారు.కడపలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇంత అవినీతిపరుడు అని అనుకోలేదని, పాలన మొదటి రోజు నుంచి అవినీతి మొదలుపెట్టారని విమర్శించారు. తాను వైసిపిలోనే ఉన్నానని, ఎవరూ తీసేయలేదని వ్యాఖ్యానించారు. ఆ పార్టీలో ఇన్నాళ్లు ఉన్నాననేంటే తనకే అసహ్యంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో గుర్తింపు పొందిన పార్టీ తరపున పోటీ చేద్దామని అనుకుంటున్నానని తెలిపారు. పవన్ కల్యాణ్ నిజాయతీని ప్రశ్నించలేమన్నారు. రాష్ట్రం కోసం చంద్రబాబు, పవన్ కలిసి పోటీ చేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. జనవరి మూడు నుంచి వివేకా కేసులో మలుపులు చోటుచేసుకోనున్నాయని అన్నారు. వివేకా కేసులో ఎర్ర గంగిరెడ్డే కీలక వ్యక్తి అని సిబిఐ గుర్తించిందని తెలిపారు. సుప్రీం తీర్పు తర్వాత కడప జిల్లాలో కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నాయని చెప్పారు.

## శివకోటి మృతి సాహితీలోకానికి తీరని లోటు

- సాహితీ స్రవంతి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

తెలంగాణా సమాజం ఎదుర్కొంటున్న వివక్షతను తన రచనలతో ఎలుగెత్తి చాటిన ఖమ్మం జిల్లా సాహితీ దిగ్గజం ప్రసిద్ధ తెలుగు కథా, నవలా రచయిత చావా శివకోటి(82) మృతి సాహితీ లోకానికి తీరనిలోటని సాహితీ స్రవంతి పేర్కొంది. సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, సత్యరంజన్ బుదవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాశరథి రంగాచార్య సమకాలికుడిగా తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న వివక్షతను, ప్రజాసమస్యలపై తన రచనలను చేశారని తెలిపారు. సాహిత్యంపై ఉన్న అభిరుచితో కథలు, కవితలు, కవితా సంపుటిలు, నవలలు రాశారని తెలిపారు. ఆయన అసురగణం అనే నవల తెలుగు సాహిత్య రంగంలో సంచలనాన్ని సష్టించిందని పేర్కొన్నారు. సాహిత్యం రంగంలో ఆయన చేసిన కషికిగాను 2020 డిసెంబరు 31న చివరిసారిగా గుడిపాటి వెంకటాచలం అవార్డును అందుకున్నారని తెలిపారు. రావిశాస్త్రి, రచన మాసపత్రిక విశిష్టకథా పురస్కారం, త్రిపురనేని గోపీచంద్ స్మారక పురస్కారంతో పాటు ఎన్నో అవార్డులు ఆయనకు సొంతమయ్యాయని తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతిని ప్రకటించారు.



## రైల్వే ప్రైవేటీకరణను ఆపాలి

- ఎఐఎల్ఆర్ఎస్ఎ నిరసనలు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని, ఎన్ఎస్‌పిని ఉపసంహరించాలని, ఓపిఎస్‌ని పునరుద్ధరించాలని కోరుతూ ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఎఐఎల్ఆర్ఎస్ఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు జాతీయ స్థాయిలో క్రూ లాబీల వద్ద బుధవారం రన్నింగ్ సిబ్బంది విజయవాడ, రాజమండ్రిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎల్ఆర్ఎస్ఎ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ రైల్వేలో ఖాళీలను తక్షణమే పూర్తి చేయాలని, 7వ సిపిసిలో పెంచిన రన్నింగ్ అలవెన్స్ ప్రకారం టిఎ భాగం 70 శాతంపై ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్‌పి (ఎస్‌హెచ్‌జి)జిఆర్-1 రద్దు కోసం ఇచ్చిన ఆర్‌బి ఆర్డర్‌ను ఉపసంహరించుకోవాలని, 40 గంటలు పిఆర్ ఇవ్వాలని, మహిళ లోకో రన్నింగ్ స్టాఫ్ అమానవీయ పని పరిస్థితులను నిలుపుదల చేయాలని కోరారు. హెచ్ఓఇఆర్ ప్రకారం తొమ్మిది గంటల డ్యూటీని పరిమితం చేయాలని, ఆర్‌వాల్వ్ లొకేషన్ ఎఎల్‌పిఎస్ డెస్క్‌మార్చాలని, సివివిఆర్ఎస్ ద్వారా సిబ్బంది పనితనాన్ని విశ్లేషణను ఆపాలని కోరారు. ఎన్‌డిఎపై సీలింగ్ పరిమితిని ఎత్తివేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని ఐఆర్‌ఆర్‌టి/డిటి బదిలీలను క్లియర్ చేయాలని ఎఐఎల్ఆర్ఎస్ఎ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డివిజనల్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేషన్, బ్రాంచ్ సెక్రటరీ ఎండి అయాజ్‌పాష, ఎస్‌సిఆర్ఇఎస్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నుంచి స్వర్గం శ్రీనివాస్, ఓబిసి సెక్రటరీ శ్రీకాంత్ యాదవ్, బ్రాంచ్ ప్రెసిడెంట్ ఆర్‌వి రాము కూడా మాట్లాడారు.

## బాలికపై యువకుడి అత్యాచారం

- పోక్సో కేసు నమోదు

**ప్రజాశక్తి - సోమల (చిత్తూరు)**




బాలికపై పలుమార్లు యువకుడు అత్యాచారానికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చిన ఘటన చిత్తూరు జిల్లా సోమల మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నంజంపేట గ్రామానికి చెందిన బాలికపై పొదలగుంటపల్లి పంచాయతీకి చెందిన రాజేష్ (22) అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడటంతో ఆమె గర్భం దాల్చింది. ఈ విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## బ్రిటన్‌లో ఉధృతంగా అంబులెన్సు వర్కర్ల సమ్మె



**లండన్ :** పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ బ్రిటన్‌లో వేలాదిమంది అంబులెన్స్ కార్మికులు బుధవారం 24గంటల సమ్మెను చేపట్టారు. గత మూడు దశాబ్దాల్లోనే మొదటిసారిగా ఇంగ్లండ్, వేల్స్ వ్యాప్తంగా వేలాదిమంది పేరా మెడికల్ సిబ్బంది, సాంకేతిక నిపుణులు విధులను బహిష్కరించారు. అయితే, ప్రాణాలకు ముప్పు ఉన్న వారికి సంబంధించిన కాల్స్‌కు సేవలందిస్తామని యూనియన్లు తెలిపాయి. అంబులెన్సులు అవసరమైన అందరికీ సేవలందించలేదని పేర్కొన్నాయి. నవంబరులో ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 10.7శాతానికి పెరగడంతో ఈ అధిక ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలు భారీగా పెంచాలని వైద్య ఆరోగ్య సిబ్బంది, ఇతర ప్రభుత్వ రంగ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఈ సమ్మెను సుదీర్ఘకాలం కొనసాగేలా చేస్తోందని యూనియన్ నేతలు విమర్శించారు. రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్‌ల పాలనలో ద్రవ్యోల్బణం మరింత పెరిగిందని, ఇలాంటి ప్రధాని, ఆరోగ్య కార్యదర్శిని ఎన్నడూ చూడలేదని అంబులెన్స్ సిబ్బందికి నేతృత్వం వహిస్తున్న యూనియన్‌కు చెందిన షరోన్ గ్రాహమ్ తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజల కోసం ఆరోగ్యరంగానికి నిధులు కేటాయించాలని కోరుకోవడం లేదని, సంక్షోభం పెరగాలని కోరుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలలో ఇప్పటికే నర్సులు రెండురోజుల సమ్మె నిర్వహించిన సంగతి తెలిసిందే. 'ఆరోగ్య వ్యవస్థ ఈనాడు తీవ్ర ఒత్తిడికి గురైంది.' అని ఆరోగ్య శాఖ కార్యదర్శి స్టీవ్ బార్క్లే మీడియాతో చెప్పారు. అంబులెన్సు వర్కర్లు సమ్మెలో వున్నందున అసలు అంబులెన్సుల అవసరమే రాకుండా వుండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వం ప్రజలను కోరింది. కాంట్రాక్ట్ క్రీడలను ఆడవద్దని, అనవసరమైన కారు ప్రయాణాలు విరమించాలని, తాగి కారు నడ పవద్దని వీటి వల్ల అంబులెన్సుల అవసరం తగ్గుతుందని ప్రభుత్వం సూచించింది.

## టిటిడి ఇఒ కుమారుడు మృతి


- నేడు కర్నూలులో అంత్యక్రియలు

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి (28) గుండెపోటుతో మరణించారు. వివాహ వేడుకల్లో భాగంగా తన మిత్రునితో కలిసి చంద్రమౌళిరెడ్డి ఆదివారం మధ్యాహ్నం చెన్నైలో శుభలేఖలు పంచుతుండగా గుండెనొప్పి రావడంతో నగరంలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేలోపే తీవ్ర గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన డాక్టర్లు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సనందించారు. అయినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం మృతిచెందినట్లు ఆస్పత్రి యాజమాన్యం ప్రకటించింది. చంద్రమౌళిరెడ్డి ముంబైలో ఉద్యోగం చేస్తూ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. చెన్నై పారిశ్రామికవేత్త, టిటిడి చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు ఎజె శేఖర్‌రెడ్డి కుమార్తెతో ఇటీవలే చంద్రమౌళిరెడ్డితో వివాహ నిశ్చయమైంది. జనవరి 26న వీరి వివాహం తిరుమలలోని శృంగేరి మఠంలో జరగాల్సి ఉంది. మరికొన్ని రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కుమారుడు మరణించడంతో ఇటు ధర్మారెడ్డి ఇంట, అటు వధువు కుటుంబంలోనూ విషాద ఛాయలు నెలకొన్నాయి. ధర్మారెడ్డి సొంతగ్రామమైన నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పారుమంచల గ్రామంలో చంద్రమౌళిరెడ్డి అంత్యక్రియలను గురువారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అంత్యక్రియలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరుకానున్నట్లు సమాచారం. చంద్రమౌళిరెడ్డి మృతిపట్ల సిపిఎం నేతలు కందారపు మురళి, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ రావు, టిటిడి అటవీ కార్మికుల సంఘం నేతలు ఈశ్వర్ రెడ్డి, తదితరులు ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

# క్రిప్టో కరెన్సీలతో సంక్షోభమే..

- నిషేధం విధించాల్సిందే
- ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదకరం
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్



**ముంబయి :** ప్రయివేటు క్రిప్టో కరెన్సీలతో తర్వాతి ఆర్థిక సంక్షోభం రానుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇలాంటి కరెన్సీలపై నిషేధం విధించాలనే తన అభిప్రాయాన్ని ఆయన పునరుద్ఘాటించారు. ఓ పత్రిక సమ్మిట్‌లో శక్తికాంత దాస్ మాట్లాడుతూ.. క్రిప్టోలకు సరైన విలువ లేదన్నారు. ఆర్థిక స్థిరత్వానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఒక వేళ భవిష్యత్తులో ఆర్థిక సంక్షోభం చోటు చేసుకుంటే అది క్రిప్టోలతోనే రానుందన్నారు. "భారత్‌లో అంతర్గత ఆర్థిక కార్యకలాపాలు పటిష్టంగా కొనసాగుతున్నాయి. అయితే.. బాహ్య కారకాలు ఆర్థిక వ్యవస్థకు కొంత నష్టం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది క్రిప్టో కరెన్సీల విలువ 40 బిలియన్ డాలర్లు తగ్గింది. ప్రస్తుత ఈ కరెన్సీ విలువ ఇప్పుడు 140 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇటీవలి క్రిప్టో ఎక్స్చేంజీ ఎఫ్‌టిఎక్స్ దివాలా తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. వీటిని ఇంకా నమ్మదగిన వాదన ఏదీ లేదు. వీటికి ఎలాంటి అంతర్గత విలువ ఉండదు. నియంత్రణా వ్యవస్థలపై విశ్వాసం లేనివారే వీటిని సష్టించారు. ఇది ప్రజలకు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చుతుందో తెలుసుకోవాలని నాకు ఆసక్తిగా ఉంది." అని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. డిజిటల్ ఇ- రూపాయిని భవిష్యత్ కరెన్సీగా అభివర్ణించారు. ఇది ఈ శతాబ్దంలో డిజిటల్ కరెన్సీలో భారత్‌ను ముందంజలో ఉంచుతుందని దాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. కరోనా సంక్షోభ సమయంలో చాలా మంది రుణాలు తీసుకోలేన్నారు. ఆ సమయంలో డిపాజిట్లు భారీగా నమోదయ్యాయన్నారు. క్రితం ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం డిసెంబరు వరకు రుణాల్లో భారీ వద్ధి చోటు చేసుకోగా.. డిపాజిట్లలో క్షీణత నమోదయ్యిందన్నారు. దేశంలో ఈ ఏడాది తొలి నెలల్లో ద్రవ్యోల్బణం పెరుగుదలకు సరఫరాల సంబంధ సమస్యలే ప్రధాన కారణమని ఆర్‌బిఐ విడుదల చేసిన ఓ బులిటెన్‌లో పేర్కొంది. ఇటీవల తగ్గిన ద్రవ్యోల్బణం తీవ్రతతో ఆర్థిక వ్యవస్థలో డిమాండ్, వ్యయాలు భారీగా పెరుగుతున్నాయని అంచనా వేసింది.

## రూ.120 కోట్లు సమీకరించిన క్యాకనెక్ట్

**హైదరాబాద్ :** లోక్ క్యాపిటల్ నేతత్వంలో సిరీస్ ఎ ఫండింగ్ రౌండ్‌లో 15 మిలియన్ల డాలర్ల (దాదాపు రూ.120 కోట్లు) నిధులను సమీకరించినట్లు అక్వాకనెక్ట్ వెల్లడించింది. ఈ నిధులతో ఫుల్ స్టాక్ ఆక్వాకల్చర్ ప్లాట్‌ఫామ్ ఆక్వా పార్ట్‌నర్స్ నెట్‌వర్క్‌ను మూడు రెట్లు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ విస్తరణతో తన దేశీయ మత్స్య మార్కెట్ అనుసంధాన పరిష్కారాలను పెంచడంతో పాటుగా.. చైనా, జపాన్‌లకు ఎగుమతులను వేగవంతం చేయాలని నిర్దేశించుకున్నట్లు తెలిపింది. ఈ సంస్థ ఆక్వాకల్చర్ రైతులు, రిటైలర్లు, సీఫుడ్ కొనుగోలుదారులకు అధికారిక క్రెడిట్, వ్యవసాయ ఇన్‌పుట్‌లు, పోస్ట్-హార్వెస్ట్ మార్కెట్‌లను కల్పిస్తుంది.

## రాజమండ్రికి విస్తరించిన మోటో వాల్ట్

**హైదరాబాద్ :** మహవీర్ గ్రూపులో భాగమైన ఆదిశ్వర్ ఆటో రైడ్ ఇండియాకు చెందిన మల్టీ బ్రాండ్ ప్రీమియం బైకులను విక్రయించే 'మోటో వాల్ట్' తన నూతన షోరూంను రాజమండ్రిలో తెరిచినట్లు ప్రకటించింది. ఇందులో మూడు సూపర్ బైకు బ్రాండ్‌లకు చెందిన పలు ద్విచక్ర వాహనాలను విక్రయానికి ఉంచామని ఆదిశ్వర్ ఆటో రైడ్ ఇండియా ఎండి వికాస్ ఝుబక్ తెలిపారు.

సంపాదకీయం

# మళ్లీ మహమ్మారి!

కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తోందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండటంతో అనేక దేశాలు మళ్లీ ఆంక్షలను విధిస్తున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే విమాన ప్రయాణాలపై ఆంక్షలు విధించాయి. మన దేశంలోనూ వైరస్ వ్యాప్తిపై ఆందోళనలు నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేస్తూ లేఖ రాయడం ఆహ్వానించదగిన పరిణామం. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బుధవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని కూడా నిర్వహించింది. అయితే లేఖతో పాటు సమావేశంలోనూ రాష్ట్రాలకు సూచనలు చేయడం తప్ప కేంద్ర ప్రభుత్వం చేపట్టే నిర్దిష్ట చర్యల ఊసు లేదు. గతానుభవాల దృష్ట్యా ఈ తరహా ధోరణి ఏమాత్రం మంచిది కాదు. కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్న సమాచారం ప్రకారమే కరోనా వైరస్ తాజా విజృంభణకు కారణమైన ఒమిక్రాన్ కొత్త వేరియంట్ బిఎఫ్-7 కూడా మన దేశంలో వెలుగులోకి వచ్చింది. బుధవారం నాటికి దేశంలో ఈ రకం వైరస్ ముగ్గురికి సోకింది. ఇది బలంగా ఇన్‌ఫెక్షన్ కలిగిస్తుందని, ఇంక్యుబేషన్ వ్యవధి తక్కువగా ఉండటంతో పాటు ఒకరి నుండి మరొకరికి త్వరగా వ్యాపిస్తుందని, వ్యాక్సిన్ల సామర్ధ్యాన్ని సైతం అధిగమిస్తుందని అంతర్జాతీయ నిర్ధారణ. అయితే, మన దేశంలో బిఎఫ్-7 రకం తొలి కేసును అక్టోబర్‌లోనే గుజరాత్‌లో గుర్తించారు. ఆ తరువాత ఇప్పటి వరకు మరో మూడు కేసులు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. వీటిలో రెండు గుజరాత్‌లోనే నమోదుకాగా, మరొకటి ఒడిశాలో వెలుగులోకి వచ్చింది.

జాన్స్ హాప్కిన్స్ కోవిడ్ ట్రాకర్ తాజా గణాంకాల ప్రకారం గడిచిన 28 రోజుల్లో (డిసెంబర్ 21 నాటికి) జపాన్‌లో అత్యధికంగా 34 లక్షల కేసులు నమోదయ్యాయి. దక్షిణ కొరియాలో 16 లక్షల కొత్త కేసులు, 1,385 మరణాలు సంభవించాయి. అమెరికాలో గత 28 రోజుల్లో 15,89,284 మందికి వైరస్ సోకింది. కోవిడ్ 19 వెలుగులోకి వచ్చినప్పటినుండి ఆ దేశంలో మహమ్మారి బారిన పడిన వారి సంఖ్య 100 మిలియన్లకు చేరింది. ఫ్రాన్స్‌లో 15,26,427 మంది ఈ కాలంలో కొత్తగా వైరస్ బారిన పడ్డారు. బ్రెజిల్‌లో 9,45,568 మందికి వైరస్ సోకగా, 3,125 మంది మరణించారు. చైనాలో 9,17,308 కేసులు నమోదుకాగా, 646 మరణాలు సంభవించాయి. జీరో కోవిడ్ పాలసీని సడలించిన తరువాత చైనాలో వైరస్ ఉధృతంగా వ్యాపిస్తోంది. జీరో కోవిడ్ విధానాన్ని కార్పొరేట్ మీడియా తీవ్రంగా విమర్శించిన సంగతి ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ఈ సమయంలోనే మన దేశంలో 6,482 మంది వైరస్ బారిన పడగా 86 మంది మృతి చెందినట్లు జాన్స్ హాప్కిన్స్ కోవిడ్ ట్రాకర్ నమోదు చేసింది.

కరోనా వ్యాప్తితో గత మూడేళ్ల కాలంలో దేశంలో కోట్లాది మంది ఆప్తులను కోల్పోయారు. ఆకస్మిక లాక్‌డౌన్ సామాన్యుల జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. కోల్పోయిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ జరగలేదు. ఆర్థిక సంక్షోభం ప్రజలను వెంటాడుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో వైరస్ వ్యాప్తిచెందకుండా చర్యలు చేపట్టడంతో పాటు, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు వైద్య, ఆరోగ్య వ్యవస్థలను తక్షణమే బలోపేతం చేసుకోవాలి. దానికవసరమైన నిధులను యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వాలి. మందులకు కొరత రాకుండా చూడాలి. వ్యాక్సినేషన్ గురించి కేంద్ర ప్రభుత్వం ఎంత గొప్పగా చెబుతున్నప్పటికీ దాదాపుగా 27 శాతం మంది ఇంకా మొదటి విడత వ్యాక్సినే అందలేదు. రెండు డోసులు వేసుకోని వారి సంఖ్య 32 శాతం దాకా ఉంది. ఇక బూస్టర్ డోస్ లెక్కల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రజలందరికి ఉచితంగా వ్యాక్సిన్ అందించడానికి కేంద్రం ఇప్పటికైనా సిద్ధపడాలి. వైరస్‌ను అడ్డుపెట్టుకుని కార్పొరేట్ మిత్రులకు కోట్లు కట్టబెట్టే విధానానికి స్వస్తి పలికి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాలతో కలిసి కార్యాచరణకు కదలాలి. అటువంటి చర్యలే ప్రజలకు ధైర్యాన్నిస్తాయి. మహమ్మారిని నియంత్రించడంలో వారందరినీ భాగస్వాములను చేస్తాయి.

మహనీయుల మాట



**చౌకగా లభించే శ్రమ శక్తి కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ జరిపే అన్వేషణ, దోపిడీల ఫలితంగానే మహిళా సమస్య సృష్టించబడింది. ఈ కారణం చేతనే శ్రామిక మహిళ మన కాలం లోని ఆర్థిక చట్రంలో ఇరుక్కుపోయింది.**

**- క్లారా జెట్కిన్,**

**జర్మన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ**

విశ్లేషణ

# పత్తి రైతుల విషాదం



**కేంద్రంలోని మోడీ ప్రభుత్వ హయాంలో ఒకవైపు కార్పొరేట్ కంపెనీల సంపద భారీగా పెరుగుతుంటే, మరోవైపు రైతులు, శ్రమజీవులు అప్పుల ఊబిలో కూరుకుపోయి పేదరికంలోకి వేగంగా జారిపోతున్నారు. నాశిరకం విత్తనాలు, పురుగు మందులు తయారు చేస్తున్న కంపెనీలను అరికట్టడానికి ప్రభుత్వ తనిఖీ విభాగాలు పని చేయడంలేదు. రాష్ట్రంలో తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి పంట నష్టానికి కారణమైన కంపెనీల మీద చర్యలు తీసుకోవడం కాకుండా పంట నష్టానికి కొద్ది మొత్తంలో పరిహారం ఇచ్చి రైతులను ఆదుకుంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్నది. రైతులు సాగు చేసేది పరిహారం కోసం కాదనే విషయాన్ని ఈ ప్రభుత్వం గుర్తించాలి. రైతు అనుకూల విధానాల కోసం, కంపెనీల దోపిడికి వ్యతిరేకంగా రైతాంగం ఐక్య ఉద్యమాలు చేపట్టాలి.**

నాసిరకం పత్తి విత్తనాల వల్ల రాష్ట్రంలో ఈ సంవత్సరం రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం జిల్లాల్లో ఈ నష్టం మరింత ఎక్కువగా వుంది. పంట పెట్టుబడిలో కోట్ల రూపాయలు నష్టపోయిన రైతులు రోడ్లు ఎక్కుతున్నారు. నాసిరకం విత్తనాలను సరఫరా చేసిన కంపెనీల మీద చర్య తీసుకోవాలని, తమకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పత్తి రైతుల నష్టం మీద తగినంత శ్రద్ధ పెట్టడంలేదు. రైతులు ఆందోళన చేసిన చోట వ్యవసాయ శాఖ నిపుణుల ద్వారా పరిశీలన జరిపి నష్టానికి మూల కారణాలను గుర్తించడంలేదు. పత్తి పంట గత నాలుగైదు సంవత్సరాల క్రితం వరకు ఏ మాత్రం సాగు కాని ప్రాంతాల్లో ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో గత రెండు సంవత్సరాల్లో భారీగా సాగు పెరిగింది. ఈ పెరుగుదలకు అనుగుణంగా విత్తనాలు, పురుగుమందులు, ప్రభుత్వ రుణ సహాయం, మార్కెటింగ్ సదుపాయం, వ్యవసాయ శాస్త్రవేత్తల నియామకం లాంటి అవసరమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోవడంలేదు. దీనివల్ల విత్తన, పురుగు మందుల కంపెనీల ఊబిలో ఇరుక్కున్న రైతులు విలవిలలాడుతున్నారు.

**పెరుగుతున్న పత్తి సాగు**

ప్రస్తుతం దేశంలో పత్తి పంట సాగుపై 60 లక్షల మంది రైతులు ప్రత్యక్షంగా...వాణిజ్యం, ప్రాసెసింగ్ లాంటి పరోక్ష పద్ధతుల్లో మరో నాలుగున్నర కోట్ల మంది ప్రజలు ఆధారపడి వున్నారు. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం క్రమంగా పెరిగింది. నీటి పారుదల అవకాశాలు వున్న ప్రాంతాల్లోనే కాక మెట్ట ప్రాంతాల్లో సైతం పత్తి సాగు పెరుగుతూ వస్తున్నది. రాష్ట్రంలో సాధారణ సాగు 15.37 లక్షల ఎకరాలు. 2021లో 1.82 లక్షల ఎకరాల్లో అదనంగా సాగు కాగా, ఈ సంవత్సరం ఏకంగా 3.82 లక్షల ఎకరాల సాగు అదనంగా పెరిగింది. రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో సాగవుతుంది. ఈ సంవత్సరం సాగు పెరుగుదల రాయలసీమ జిల్లాలో అధికంగా వుంది. కడప జిల్లాలో 151 శాతం, అనంతపురం 57 శాతం, నంద్యాల 37 శాతం, ప్రకాశం జిల్లాలో 40 శాతం అదనంగా పెరిగింది.



**వి. రాంభూపాల్**

అనంతపురం జిల్లా పంటల సాగులో వచ్చిన మార్పులను పరిశీలిస్తే ఈ ధోరణికి కారణాలు అర్థమవుతాయి. జిల్లాలో మొత్తం సాగు భూమి 24 లక్షల 12 వేల 500 ఎకరాలు కాగా 2007లో 21 లక్షల 87 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగైంది. రాష్ట్రంలోనే అత్యధికమిది. అయితే 2021 నాటికి 11 లక్షల 85 వేల ఎకరాల్లో (అంటే 10 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు తగ్గింది), ఈ సంవత్సరం కేవలం 4 లక్షల 41 వేల ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే గత 15 సంవత్సరాల్లో సుమారు 22 లక్షల ఎకరాల నుండి 4 లక్షల ఎకరాల సాగుకు వేరుశనగ పంట కుదించబడింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం హెక్టారుకు 1200 కేజీల వేరుశనగ దిగుబడి వస్తే రైతుకు గిట్టుబాటు అవుతుంది. అయితే గత 26 సంవత్సరాల దిగుబడి పరిశీలిస్తే 21 సంవత్సరాల సగటు 75 కేజీల నుంచి 711 కేజీల వరకు మాత్రమే వచ్చింది. గడచిన 19 సంవత్సరాల్లో 13 సంవత్సరాలు జిల్లాలోని (ఉమ్మడి జిల్లా) 63 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించాల్సి వచ్చింది. ఈ కరువులకు ప్రధాన కారణం వర్షాభావం. సాధారణంగా పంటలు సాగు చేయడానికి 750 మి.మీ కావాలని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. గత 26 సంవత్సరాలను గమనిస్తే కేవలం 6 సంవత్సరాలు మాత్రమే 700 మి.మీటర్లకు మించి వర్షం వచ్చింది. అంటే 20 సంవత్సరాలు పంటలు పండే వర్షాలు రాలేదు. వీటికి తోడు ఎరువులు, పురుగుమందులు, పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిన వేరుశనగ ధర మాత్రం గత 20 సంవత్సరాల నాడు ఉన్న ధరకు కొద్దిగా అటుఇటుగా వుంది. ఈ కారణాలన్నిటి వల్ల వేరుశనగ సాగు జిల్లాలో గణనీయంగా తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితే రాయలసీమ లోని అన్ని జిల్లాలో వుంది. కర్నూలులో వరుసగా నష్టాల పాలవుతున్న ఉల్లి పంట ఇలాగే సాగు తగ్గిపోతున్నది.

**పత్తి పంట వైపు రైతులు ఎందుకు మళ్ళారు?**

పత్తి దిగుబడి గత రెండు సంవత్సరాల్లో సాధారణంగా ఎకరాకు 10 నుండి 12 క్వింటాళ్ళు వచ్చింది. గతం నుండి సాగుచేస్తున్న వేరుశనగ పంట వరుస నష్టాలు, పత్తి దిగుబడి పెరగడం, ధర గిట్టుబాటు కావడంతో రైతులు పత్తి పంటవైపు మళ్ళారు. కొన్ని ప్రాంతాల్లో విత్తన కంపెనీలు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు పత్తి సాగుకు అప్పులు ఇస్తున్నారు. పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో పాటు, కొంత మొత్తం నగదు రూపంలో అప్పులు ఇచ్చి పంట మొత్తాన్ని వారే ముందస్తు ధరతో పంట కొనుగోలు చేస్తున్నారు. బ్యాంకుల్లో పేద, మధ్యతరగతి రైతులకు అప్పులు ఇవ్వడం తగ్గిపోయింది. ప్రైవేట్ అప్పులు ఇవ్వడంలో కంపెనీలు లేదా ఫెర్టిలైజర్ షాపులు రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు అయ్యాయి. ఇది కూడా పత్తి పంట సాగుకు మరో కారణంగా వుంది. రైతుకు అవసరమైన సలహాలు, సూచనలు చేసే అధికార వ్యవస్థ పూర్తిగా బలహీనపడింది. ఈ స్థానంలో కంపెనీల ప్రతినిధులు పొలాల్లో తిరుగుతూ విత్తనం దశ నుండి పంట సాగు వరకు అన్ని సలహాలు ఇస్తున్నారు. వీరి అర్హత ఏమిటీ? వీరు ఇచ్చే సలహాల్లో నిజానిజాలు ఏమిటీ? పరిశీలించే అధికార యంత్రాంగం లేదు. దీంతో రైతులకు కంపెనీల ప్రతినిధులే దిక్కయ్యారు.

**కంపెనీల మోసాలు**

పత్తి విత్తనాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా 400కు పైగా విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి, ప్రాసెసింగ్, గ్రేడింగ్ చేపడుతున్నాయి. దేశానికి అవసరమైన పత్తి విత్తనాల్లో 60 శాతం తెలంగాణ రాష్ట్రం నుండే సాగు అవుతుంది. ఈ సంవత్సరం సాధారణ సాగు కంటే పత్తి సాగు అధికంగా పెరగడంతో కంపెనీల దగ్గర వున్న విత్తనాల్లో నాసిరకం వాటిని కలిపి దోపిడి తీవ్రం చేశారు. సాధారణంగా 90 శాతం బి.టి విత్తనాల్లో పది శాతం బి.టి కాని విత్తనాలు కలుపుతారు. వీటివల్ల పత్తి దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతారు. గతంలో 450 గ్రాముల పత్తివిత్తనాల ప్యాకెట్‌లో 45 గ్రాముల నాన్ బి.టి విత్తనాలు ప్రత్యేక ప్యాకెట్‌లో ఇచ్చేవారు. వీటిని అక్కిల్లలో (హద్దుల్లో) రైతులు వేసేవారు. కాని విధానం మారిందనే సాకుతో విత్తన ప్యాకెట్లలోనే నాన్ బి.టి విత్తనాలు కలపడం గత రెండు సంవత్సరాల్లో పెరిగింది. దీంతో నాణ్యమైన విత్తనాలు ఏవో, నాసిరకం ఏవో కనిపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. విత్తన కంపెనీల నుండి వ్యాపారస్తుల దగ్గరకు వచ్చిన ప్రతి లాట్‌ను వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ చేసి వాటి నాణ్యతను నిర్ధారించిన తర్వాతే అమ్మకాలు చేయాలని చట్టంలో వున్నప్పటికి ఎక్కడా అమలు కావడంలేదు. ప్రభుత్వ రంగ విత్తన సంస్థలు ఉన్ననాడు రూపొందించుకున్న 1968 విత్తన చట్టమే నేటికి అమలవుతుంది. ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం విత్తనాలు సరఫరా చేస్తారని తెలిసి చట్టాలను మార్చడం కాని, నాసిరకం విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవడానికి అవసరమైన విధానాలు రూపొందించక పోవడం వెనుక కంపెనీల హస్తం ఎంత బలంగా వుందో అర్థమవుతుంది.

పంట సక్రమంగా రావాలంటే ఫెర్టిలైజర్ కంపెనీలు రకరకాల మందులు ఇచ్చి రైతులను అప్పుల ఊబిలో దించుతున్నాయి. పత్తి పంటకు కనీసం 12 సార్లు మందులు కొడుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 50 శాతం పైగా జిల్లాలో పురుగుమందులు అమ్ముడుపోయాయి. ఒక ఎకరాకు కనీసం రూ. 50 వేల ఖర్చు అవుతుంది. విత్తనాల నాసిరకంపై, పురుగు మందుల వాడకంపై కనీసం విచారించే అధికార యంత్రాంగం జిల్లాల్లో లేదు. పంట నష్టం జరిగిందని రోడ్లపైకి రైతులు వచ్చి ఆందోళ చేస్తే నంద్యాల నుండి శాస్త్రవేత్తలు వస్తున్నారు. వారు తనిఖీ చేసిన నివేదిక బహిర్గతం కాదు. ఒకవేళ ప్రకటిస్తే ప్రకృతి కారణాలు చూపుతున్నారే కాని విత్తన కంపెనీల గురించి ఒక్క మాట మాట్లాడడంలేదు. ఎవరైనా అధికారి నిజాయితీగా వాస్తవాన్ని ప్రకటిస్తే వారిపై వేధింపులు, బదిలీలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

**ప్రభుత్వాల బాధ్యత**

కార్పొరేట్ ప్రయోజనాలు, రైతుల ప్రయోజనాలు పరస్పరం భిన్నమైనవి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ హయాంలో ఒకవైపు కార్పొరేట్ కంపెనీల సంపద భారీగా పెరుగుతుంటే, మరోవైపు రైతులు, శ్రమజీవులు అప్పుల ఊబిలో కూరుకుపోయి పేదరికంలోకి వేగంగా జారిపోతున్నారు. నాశిరకం విత్తనాలు, పురుగు మందులు తయారు చేస్తున్న కంపెనీలను అరికట్టడానికి ప్రభుత్వ తనిఖీ విభాగాలు పని చేయడంలేదు. రాష్ట్రంలో తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న వైసిపి పంట నష్టానికి కారణమైన కంపెనీల మీద చర్యలు తీసుకోవడం కాకుండా పంట నష్టానికి కొద్ది మొత్తంలో పరిహారం ఇచ్చి రైతులను ఆదుకుంటున్నట్లు ప్రచారం చేసుకుంటున్నది. రైతులు సాగు చేసేది పరిహారం కోసం కాదనే విషయాన్ని ఈ ప్రభుత్వం గుర్తించాలి. రైతు అనుకూల విధానాల కోసం, కంపెనీల దోపిడికి వ్యతిరేకంగా రైతాంగం ఐక్య ఉద్యమాలు చేపట్టాలి.

**/ వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు/**

# విదేశీ మారక నిల్వల కోసం వెంపర్లాట

విదేశీ మారక నిల్వలు దేశంలో తరిగిపోతున్నాయని, అవి ఇటీవల రెండేళ్ళ కనిష్ట స్థాయికి చేరాయని పలు నివేదికలు వెల్లడించాయి. దేశంలో విదేశీ మారక నిల్వలు 5,24,520 మిలియన్ డాలర్ల స్థాయికి చేరాయి. డాలర్‌తో రూపాయి విలువ సంవత్సర కాలంలోనే 12 శాతం క్షీణించి అత్యధిక కనిష్ట స్థాయికి చేరి రూపాయి విలువ 83గా నమోదవుతున్నది. ఈ తరుణంలో, పతనమౌతున్న రూపాయి విలువను పరిరక్షించడానికి రిజర్వ్ బ్యాంక్ డాలర్లను విక్రయించడం వంటి చర్యలు కూడా విదేశీ మారక నిల్వల క్షీణతకు కారణం అనేది ఒక ప్రధాన విశ్లేషణ. ఫలితంగా రిజర్వ్ బ్యాంక్ వద్ద ఫారెక్స్ నిల్వలలో భారీ తగ్గుదల చోటుచేసుకుంది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విదేశీ మారక నిల్వల పెంపుదలకు ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ అనేక చర్యలను ప్రకటించవలసి వచ్చింది. గవర్నమెంట్ బాండ్లు, కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులకు సంబంధించిన విధి విధానాలను సరళతరం చేయడంతో పాటు ఎన్‌ఆర్‌ఐల నుంచి డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులకు సంబంధించి వడ్డీ, రాయల్టీలు, డివిడెండ్ చెల్లింపులు, లైసెన్స్ ఫీజులు, విదేశీ ప్రయాణాలు, ఇతర ఆర్థిక సేవలకు చెల్లింపుల స్థాయిలో కూడా గణనీయమైన వృద్ధి నమోదయింది.

ఈ సంవత్సరం ఏప్రిల్ 2వ తేదీన 606.475 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలు సెప్టెంబర్ 23 నాటికి 537.5 బిలియన్ డాలర్ల స్థాయికి తగ్గిపోయాయి. ఇటీవల ఒక దశలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 23 నెలల కనిష్ట స్థాయికి పడిపోయాయి. ఫారెక్స్ నిల్వలలో మెజారిటీ వాటా కలిగిన విదేశీ కరెన్సీల విలువ 652.7 కోట్ల డాలర్లు తగ్గి 49,211 కోట్ల డాలర్లకు పడిపోయింది. బంగారం నిల్వలు కూడా 133 కోట్ల మేర తగ్గి 3,830 కోట్ల డాలర్లుకు పరిమితమైనాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వద్ద దేశ ప్రత్యక్ష డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్) విలువ 5 కోట్ల డాలర్ల మేర తగ్గి 1778 కోట్ల డాలర్ల స్థాయికి దిగజారింది. ఐఎంఎఫ్ వద్ద దేశ నిల్వల స్థాయి 2.4 కోట్ల డాలర్లు క్షీణించింది.

అంతర్జాతీయ కరెన్సీల స్థాయితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక నియమాలను కూడా సులభతరం చేసింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు విదేశీ కరెన్సీ రూపంలో వున్న ఆస్తులు. వీటిని దేశీయ కేంద్ర బ్యాంకు నిర్వహిస్తుంది. ఇవి విదేశీ కరెన్సీ బాండ్లు, ట్రెజరీ బిల్లులు, ఇతర గవర్నమెంట్ సెక్యూరిటీలు, బంగారం నిల్వల రూపంలో ఉంటాయి. ఎక్కువ విదేశీ మారక నిల్వలు అమెరికన్ డాలర్ రూపంలో నిల్వలుగా ఉండటం గమనార్హం. అయితే ఇవి బ్రిటీష్ 'పౌండ్', యూరోపియన్ 'యూరో', చైనీస్ 'యువాన్', జపనీస్ 'యెన్' రూపాలలో కూడా ఉంటాయి. విదేశీ మారక నిల్వలు కేవలం దిగుమతుల చెల్లింపుల పరిధికే పరిమితం కాకుండా దేశ ద్రవ్య పరపతి విధాన ప్రక్రియపై కూడా క్రియాశీలక ప్రభావితం చూపుతున్నాయి. అంతర్జాతీయ వ్యాపారాన్ని సంతులనం చేయడానికి, దేశీయ కరెన్సీ మారకం విలువను స్థిరంగా ఉంచేందుకు, స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు ఆర్థిక వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పాదుకొల్పటంలో కూడా ఇవి నిర్ణయాత్మకమైన పాత్రను పోషిస్తున్నాయి.



ఒక దేశం ఎగుమతుల ద్వారా సముపార్జించే ఆదాయం దిగుమతుల కన్నా ఎక్కువ మేరకు ఉన్నపుడు విదేశీ మారకపు ద్రవ్య నిల్వలలో వృద్ధి నమోదవుతుంది. కరెంట్ ఖాతా మిగులు వలన కూడా దేశంలో విదేశీ మారక నిల్వల పెరుగుదలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఈ దిశగా గత కొన్ని సంవత్సరాలుగా క్రమంగా కూడపెట్టిన విదేశీ మారకపు ద్రవ్య నిల్వలలో చైనా, జపాన్, స్విట్జర్లాండ్ ప్రపంచంలోనే అత్యధిక విదేశీ కరెన్సీ నిల్వలు ఉన్న దేశాలుగా ఆవిర్భవించటం గమనార్హం.

ఫారెక్స్ నిల్వలు 2022 మార్చి 31, నాటికి 607.31 బిలియన్ల స్థాయికి చేరినప్పటికీ, దీనికి భిన్నంగా సరుకుల వర్తకపు లోటు 1.2 ట్రిలియన్ డాలర్లకు చేరింది. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, ఇతర దేశాలలో ఉన్న భారతీయులు దేశానికి పంపుతున్న నగదు నిల్వలు, పర్యాటకం వంటి పరిశ్రమలు, ఆదాయం ఆర్థిక వ్యవస్థకు జమ అవుతుండగా, రుణాలపై సెప్టెంబర్ మాసాంతానికి అమెరికన్ డాలర్ 14.5 శాతం మేరకు బలపడి వృద్ధి చెందగా ఇదే సమయంలో భారతదేశ రూపాయి 7.4 శాతం క్షీణించింది. అక్టోబరు మాసంలో మొత్తం ఫారిన్ రిజర్వ్‌లలో సింహభాగంగా ఉన్న ఫారిన్ కరెన్సీ ఎసెట్స్ (ఎఫ్‌సిఎ) 3.59 బిలియన్ డాలర్లు తగ్గి 465.08 బిలియన్లుగా ఉన్నాయి. రూపాయి విలువ 83 స్థాయికి పడిపోయిన నేపథ్యంలో కరెన్సీ క్షీణతను కాపాడడానికి రిజర్వ్ బ్యాంకు 100 బిలియన్ల విదేశీ నిల్వలను వినియోగించింది. పరిస్థితిని అంచనా వేసి విదేశీ ద్రవ్య మార్కెట్‌లో కల్పించుకోవలసి వస్తుందన్న ఆర్‌బిఐ అంచనా పొంచి ఉన్న ప్రమాదానికి సంకేతం. ఆర్థిక రంగంలో అనేక విపత్తులకు విదేశీ మారక ద్రవ్య నిల్వల లోటు ప్రభావం కారణమౌతోంది. సహజ వనరులు, బంగారం వంటి నిల్వలు ఉన్నప్పటికీ విదేశీ మారక ద్రవ్యానికి ఉన్న లిక్విడిటీ వీటికి ఉండదు. త్వరితగతిన అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు నిర్వహించే పరిస్థితులలో స్తబ్దత ఏర్పడి దేశీయ కరెన్సీ పట్ల విశ్వవిపణిలో విశ్వాసం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడతాయి.

ఉత్పత్తి, వాటి వినియోగం ప్రాతిపదికగా అనుసంధానమైన ఆర్థికాభివృద్ధికి భిన్నంగా, లాభాపేక్షే ధ్యేయంగా ఉన్న ద్రవ్య పెట్టుబడి, స్పెక్యులేటివ్ కరెన్సీ మార్కెట్లతో ముడిపడి ఆర్థిక వ్యవస్థ మూలాలను నిర్మించాలనుకోవటం భ్రాంతి మాత్రమే. ఆర్థిక మూలాల పటిష్టతకు స్వీయ నియంత్రణ మార్గాలను అన్వేషించకుండా, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నిర్దేశిత విధానాల ప్రాతిపదికన విదేశీ మారక ద్రవ్య నిల్వల సంక్షోభం నుండి బయట పడాలనుకునే విధానాలకు స్వస్తి పలకటం తక్షణ కర్తవ్యం.


**- జి. కిషోర్ కుమార్,**
**ఎస్‌సిజెడ్‌ఐఇఎఫ్ జాయింట్ సెక్రటరీ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ఎల్ఐసి ఉద్యోగ సంఘం),**
**సెల్ : 9440905501**

విమర్శ

# మైనారిటీ విద్యావకాశాలపై దాడి...

మైనారిటీ కమ్యూనిటీలుగా ఉన్న ముస్లింలు, బౌద్ధులు, క్రిస్టియన్లు, జైనులు, పార్శీలు, సిక్కులు ఎంఫిల్, పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లను కొనసాగించడానికి ఐదేళ్ల పాటు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో 2009లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (యంఎయన్‌ఎఫ్)ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలోకి తొక్కింది. 2022-23 నుండి మైనారిటీ విద్యార్థులకు ఇచ్చే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ (యంఎయన్‌ఎఫ్)ను రద్దు చేస్తున్నామని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి స్మృతి ఇరానీ ఇటీవల పార్లమెంట్‌లో ప్రకటించారు. ఇది పూర్తిగా మైనారిటీ వర్గాన్ని ఉన్నత విద్య నుండి దూరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రే. ఈ చర్య దేశంలోని పేద, మైనారిటీ విద్యార్థులకు శాపంగా మారి స్కాలర్‌షిప్‌లకు బ్రేక్ వేస్తూ వారిని చదువులకు దూరం చేస్తున్నది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల కోసం యువ పండితులను ఎంపిక చేయటానికి ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు లక్షలాది మంది హాజరైనా ప్రతీ సంవత్సరం 25 వేల మంది మాత్రమే ఫెలోషిప్ పొందుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. అయినప్పటికీ మైనారిటీలకు చెందినవారికి ఉపయోగపడే మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను మోడీ సర్కార్ నిలిపివేసి వారిని ఉద్దేశ్యపూర్వకంగానే అంధకారంలోకి నెడుతున్నది.

దేశంలోని ముస్లింలు, ఇతర వర్గాల మధ్య విద్యాపరమైన అంతరాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు చేసిన తర్వాతనే 2009లో మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్ ప్రారంభించబడింది. 2019లో నిర్వహించిన ఆలిండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రకారం దేశ జనాభాలో ముస్లింలు 14.2 శాతం మంది ఉన్నారు. అయితే దేశంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో చేరిన వారిలో కేవలం 5.5 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇది కేవలం ముస్లింల కోసమే తీసుకొచ్చిన పథకం కాకపోయినప్పటికీ దీని ద్వారా లబ్ధి పొందే వర్గంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. మతపరమైన



రాజకీయాలకు అలవాటు పడిన కేంద్రంలోని బిజెపి సర్కార్ ఈ ఫెలోషిప్‌ను రద్దు చేసి మైనారిటీల విద్యా అవకాశాలపై దాడి చేయాలనే ఆ పథకాన్ని గత కొన్ని సంవత్సరాల నుండి నీరుగారుస్తూ వస్తున్నది. 2019-20లో 1,251 మందికి ఈ ఫెలోషిప్ అందజేయగా, 2020-21 నాటికి 1,075 మందికి కుదించింది. ఆ పథకానికి ఇచ్చే నిధులను కూడా 100 కోట్ల రూపాయల నుంచి 74 కోట్ల రూపాయలకు తగ్గించి ఇప్పుడు ఏకంగా ఆ ఫెలోషిప్‌నే ఎత్తేసింది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని యూనివర్సిటీలకు నిధులను తగ్గించి ప్రభుత్వ యూనివర్సిటీ వ్యవస్థను నాశనం చేస్తున్నది. కేంద్రప్రభుత్వం ఇప్పుడు యంఎయన్‌ఎఫ్‌ను ఆపడం ద్వారా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలన్న మైనారిటీల ఆకాంక్షను నులిమేస్తున్నది.

బిజెపి పాలనలో మైనారిటీల సంక్షేమం అన్న పదానికి కూడా విలువ లేకుండా పోయింది. దళితులు, గిరిజనులు, అల్ప సంఖ్యాక వర్గాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం బిజెపి ఎజెండాలోనే లేవు. అగ్రవర్ణాల ఆధిపత్యంతోనే సమాజం నడవాలని బిజెపి సైద్ధాంతికంగా నమ్ముతున్నది. మనువాదాన్ని, మనుస్మృతిని మనసారా నమ్ముతున్న సంఘ్ పరివార్ పాలనలో అణచివేతకు గురవుతున్న అట్టడుగు తరగతుల ప్రజల సంక్షేమాన్ని వీరు పట్టించుకోరనేది ఆచరణలో కనబడుతున్నది. బిజెపి పాలనలో మైనారిటీల సంక్షేమాన్ని వెతకడం అంటే ఎండమావుల్లో నీటి కోసం వెతకటమే. స్వాతంత్ర్యానంతరం ముస్లిం మైనారిటీల ఆర్థిక, సామాజిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యంపై అనేకమార్లు సర్వేలు జరిగాయి. గోపాల్‌సింగ్ కమిషన్, రాజేంద్ర సచార్ అధ్యక్షతన ఏర్పడిన సచార్ కమిటీ, జస్టిస్ రంగనాథ్ మిశ్రా అధ్యక్షతన పని చేసిన మైనారిటీ కమిషన్లు మైనారిటీల సమస్యలపై, విద్య, వైద్యం, సామాజిక అభివృద్ధి, ఉపాధి, పరిశ్రమలు, వ్యాపారం తదితర రంగాలపై లోతైన అధ్యయనం చేశాయి. విద్య, ఉపాధి రంగాల్లో దేశంలోని ఇతర ప్రజలతో పోల్చితే ముస్లిం ప్రజలు చాలా వెనకబడి ఉన్నారని, ఉన్నత విద్యలో దళితులు, గిరిజనుల కంటే కూడా అధ్వాన్నమైన స్థితిలో ఈ ముస్లిం ప్రజలు ఉన్నారని సచార్ కమిటీ నివేదిక వెల్లడించింది. అంతే కాదు. విద్యలో ముస్లిం మహిళలు దేశంలోనే అందరికంటే వెనుకబడి ఉన్నారని, వ్యాపార రంగంలో ఈ తరగతి ప్రజలకు జాతీయ బ్యాంకులు చేస్తున్న సహాయం నామమాత్రంగా ఉందని కూడా పేర్కొంది. ఈ పరిస్థితి మారనట్లయితే భవిష్యత్తులో ముస్లిం మైనారిటీలు దేశ ప్రధాన స్రవంతి నుండి వేరుపడతారని కూడా హెచ్చరించింది. వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులు, విద్య, ఉపాధి రంగాల్లో ప్రత్యేక వసతులు కల్పించాలని కూడా తన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అయినప్పటికీ అభివృద్ధి లోని చివరి ఫలాలు కూడా మైనారిటీ ప్రజలకు దక్కటంలేదు. ప్రత్యేకించి బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం ప్రజల సంక్షేమం మాట అటుంచితే వారి జీవితాలకే ప్రమాదం వచ్చింది. గో రక్షణ దళాల దాడులు, ముమ్మారు తలాక్ పేరిట జైలు శిక్షలు వేయటం, లవ్ జిహాద్ పేరిట విద్వేషాన్ని రెచ్చగొట్టటం, ఏకపక్షంగా జమ్ము-కాశ్మీర్‌ను విడగొట్టడం, ఆ ప్రజలకిచ్చిన హామీ ఆర్టికల్ 370 రద్దు చేయటం, వారి ఆస్తులు కాజేయటానికి 35 (ఎ)ను రద్దు చేయటం ఈ దేశంలో మైనారిటీలకు తీవ్రమైన అభద్రతా వాతావరణాన్ని సృష్టించాయి. కేంద్ర ప్రభుత్వం మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇచ్చేలా చట్టాన్ని సవరించటమంటే ముస్లింలకు పౌరసత్వాన్ని ఇవ్వబోమనే. రాజ్యాంగ మౌలిక విలువలను తుంగలో తొక్కటమే. కాబట్టి దేశంలోని లౌకిక శక్తుల మద్దతును కూడగట్టి మైనారిటీ ప్రజల మౌలిక హక్కులకై పోరాడటం దేశంలో ఓ ప్రధాన కర్తవ్యంగా ముందుకొచ్చింది.

**- యం.ఎ. జబ్బార్,**
**సెల్: 9177264832**

## కేంద్రం స్పందించకుంటే ..

### మైనార్టీ విద్యార్థులకు సాయం : స్టాలిన్

**చెన్నై :** ఇటీవల మైనారిటీ విద్యార్థుల పట్ల కక్షసాధింపుగా మోడీ ప్రభుత్వం మౌలానా అజాద్ నేషనల్ ఫెలోషిప్ (ఎంఎఎన్ఎఫ్)ను రద్దు చేసింది. ఈ ఫెలోషిప్‌ను కేంద్రం పునరుద్ధరించకపోతే మైనార్టీ విద్యార్థులకు తమిళనాడు ప్రభుత్వం సహాయం చేస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ హామీ ఇచ్చారు. ఇక్కడ జరిగిన క్రిస్మస్ వేడుకల కార్యక్రమంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ హామీ ఇచ్చారు. మైనార్టీలు నిర్వహించే పాఠశాలలకు ఉపాధ్యాయుల నియామకం అంశంపైనా సిఎం సానుకూలంగా స్పందించారు. ఇజ్రాయిల్ యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వ సహాయాన్ని ఇప్పటికే పెంచామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

## న్యాయ వ్యవస్థను బెదిరించడం ఆపండి : ఐలు

**న్యూఢిల్లీ :** న్యాయ వ్యవస్థను ప్రభుత్వం బెదిరించడాన్ని అఖిల భారత న్యాయవాదుల యూనియన్ (ఎఐఎల్‌యు) విమర్శించింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇటీవల పరోక్షంగా చేసిన బెదిరింపును కూడా విమర్శించింది. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. "ప్రభుత్వం ఫైళ్లను పెండింగ్‌లో పెట్టుకుని కూర్చుంటోందని ఎన్నడూ అనవద్దు, అటువంటప్పుడు ప్రభుత్వానికి ఫైళ్లను పంపవద్దు, మీకు మీరే నియమితులై మొత్తం వ్యవహారం చక్కబెట్టండి." అని న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా రిజిజు ఇటీవల చేసిన ప్రకటనను ఎఐఎల్‌యు ప్రస్తావించింది. పార్లమెంటరీ చట్టానికి వ్యతిరేకంగా న్యాయసమీక్షను వినియోగించినందుకు న్యాయవ్యవస్థను ఉప రాష్ట్రపతి సైతం బహిరంగంగా నిందించారని గుర్తు చేసింది. నిరంకుశవాదానికి, ఫాసిజానికి వెసులుబాటు కల్పించేలా న్యాయ వ్యవస్థను మచ్చిక చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలే ఇవని ఈ నెల 14, 15 తేదీల్లో మంత్రి చేసిన ప్రకటనలు చూస్తుంటే అర్థమవుతోందని ఎఐఎల్‌యు ప్రకటన పేర్కొంది. ప్రజాస్వామ్యమనేది క్రమం తప్పక జరిగే ఎన్నికల కన్నా, చట్టసభల ఆధిక్యత కన్నా ఎక్కువని వ్యాఖ్యానించింది. రాజ్యాంగ ధర్మాసనాలకు న్యాయపరమైన సమీక్షల అధికారమనేది మన రాజ్యాంగానికి మౌలిక పునాది వంటిదని పేర్కొంది. ప్రభుత్వ ప్రకటనలు పూర్తిగా తగనివి, అసం బద్ధమైనవి, ఖండించదగినవని తెలిపింది. న్యాయవ్యవస్థ స్వతంత్రానికి ప్రత్యక్షంగా భంగం కలిగించడం, కించపరచడం, ఆమోదయోగ్యం కాదని తెలిపింది.

## 129 కరోనా కేసులు, ఒకరి మృతి

**న్యూఢిల్లీ :** గత 24 గంటల్లో కొత్తగా 129 కరోనా కేసులు నమోదయ్యాయని, ఒకరు మృతి చెందారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. యాక్టివ్ కేసుల సంఖ్య 3,408కి, మొత్తం మరణాల సంఖ్య 5,30,677కి చేరిందని తెలిపింది.

## భారత్ జోడో యాత్రను వాయిదా వేసుకోండి

### రాహుల్‌కు మాండవీయ లేఖ

**న్యూఢిల్లీ :** కోవిడ్-19 మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, లేదా భారత్ జోడో యాత్రను వాయిదా వేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌లకు కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా మంగళవారం లేఖ రాశారు. మాస్కులు, శానిటైజర్లు ఉపయోగించాలని, టీకా వేసుకున్న వారే యాత్రలో పాల్గొనాలని పేర్కొన్నారు. యాత్రలో కోవిడ్ మార్గదర్శకాలను పాటించడం లేదని రాజస్థాన్ ఎంపిలు పిపి చౌదరి, నిహాల్ చంద్ లేఖ రాసిన విషయాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు.

**బిజెపి నాయకులకు లేఖలు పంపారా? : కాంగ్రెస్**

కర్ణాటక, రాజస్థాన్‌లో బిజెపి నాయకులు కూడా యాత్రలు చేస్తున్నారని, వారికి కూడా ఇలాంటి లేఖలు పంపారా.. అని కేంద్ర మంత్రిని కాంగ్రెస్ నాయకులు పవన్ ఖేరా ప్రశ్నించారు. యాత్రతో రాజకీయాలు చేయవద్దని జైరాం రమేష్ ఒక ప్రకటనలో కోరారు.

**హర్యానాలో ప్రవేశించిన జోడోయాత్ర**

బుధవారం ఉదయం రాజస్థాన్ నుంచి హర్యానాలోకి భారత్ జోడో యాత్ర ప్రవేశించింది. ఈ నెల 24న ఢిల్లీలో ప్రవేశిస్తుంది. కొద్దిరోజుల విరామం తర్వాత జనవరి 3న యాత్ర ప్రారంభమవుతుంది.

# విజ్ఞానయాత్రలో విషాదం

- బస్సు ప్రమాదంలో ఏడుగురు బాలికల మృతి
- 35మందికి గాయాలు



**ఇంఫాల్ :** విజ్ఞానయాత్ర విషాద యాత్రగా మారింది. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు 55 కిలోమీటర్ల దూరంలో ఒక గ్రామానికి సమీపంలో బస్సు కొండ పైనుండి పడిపోవడంతో ఏడుగురు స్కూలు విద్యార్థినులు మరణించారు. మరో 35మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మృతి చెందిన వారందరూ 14 నుండి 17 ఏళ్ల లోపు బాలికలే. గాయపడిన వారిలో మరో ఐదుగురి పరిస్థితి విషమంగా వుండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని భావిస్తున్నట్లు అధికారులు చెప్పారు. నానీ జిల్లా లాంగ్సాయ్ పార్ట్-3 గ్రామానికి సమీపంలో ఉదయం 11గంటల సమయంలో ఈ దుర్ఘటన సంభవించింది. తోబల్ జిల్లా హయ్యర్ సెకండరీ స్కూలు విద్యార్థులందరూ రెండు బస్సుల్లో విజ్ఞాన యాత్ర కోసం వెళ్లారు. అయితే ప్రమాదకరంగా వున్న మలుపు వద్ద ఒక వాహనంపై డ్రైవర్‌కు పట్టుతప్పడంతో బస్సు గుట్టను ఢీకొని పడిపోయిందని అధికారులు తెలిపారు. ఐదుగురు విద్యార్థినులు అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు బిష్ణుపూర్ జిల్లా ఆస్పత్రిలో మరణించారు. గాయపడిన వారిని ఇంఫాల్ ఆస్పత్రుల్లో చేర్చారు. పెద్ద శబ్దం వినిపించిందని, సెకన్ల వ్యవధిలోనే ఏడుపులు, పెడబొబ్బలతో ఆ ప్రాంతమంతా మారుమోగిందని లాంగ్సాయ్ నివాసి ఒకరు తెలిపారు. దీంతో జనవరి 10వరకు స్కూలు ఎక్సకర్షన్లన్నింటినీ నిషేధించారు. ఈ ప్రాంతం ప్రమాదాలు జరిగే ప్రాంతమని, ఈ నెల్లో ఇది మూడో ప్రమాదమని చెప్పారు. మృతి చెందినవారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

# సరిహద్దు ఘర్షణలపై వాస్తవాలు వెల్లడించాలి

### పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన




**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

సరిహద్దు ఘర్షణలపై వాస్తవాలు వెల్లడించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. కేంద్ర ప్రభుత్వం దాచివేత దోరణి ప్రదర్శించడం సమంజసం కాదని, అసలు ఏం జరుగుతోందో ప్రజలకు తెలియాలని పేర్కొన్నాయి. ఈ మేరకు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. బుధవారం పార్లమెంట్‌లో ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం ఎదుట 12 ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి. ఆయా పార్టీల ఎంపిలు ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. సరిహద్దు ఘర్షణలపై ప్రభుత్వం మౌనం విడనాడాలని, దేశ ప్రయోజనాలపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోనియా గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, అధిర్ రంజన్ చౌదరి, చిదంబరం, టిఆర్ బాలు, తిరుచ్చి శివ, సుప్రియా సూలే, ప్రియాంక చతుర్వేది, ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

**నిరసనల నడుమ లోక్‌సభ వాయిదా**

అనంతరం ప్రారంభమైన లోక్‌సభ రెండు నిమిషాలకే ప్రతిపక్షాల నిరసనల మధ్య వాయిదా పడింది. సరిహద్దు ఘర్షణలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాల నిరసన తెలపడంతో, స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో సరిహద్దు సమస్యపై చర్చించాలని ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి.

**కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం**

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. సోనియాగాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చించారు. న్యాయ వ్యవస్థపై ప్రభుత్వం చేస్తున్న దాడిని సోనియా గాంధీ లేవనెత్తారు. కేంద్ర మంత్రి, ఉపరాష్ట్రపతి చేసిన వ్యాఖ్యలు, వ్యవస్థను మరింత బలహీన పరుస్తాయని విమర్శించారు.

## కాపుల రిజర్వేషన్ రాష్ట్ర పరిధిలోదే : కేంద్రం

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు సొంత జాబితాలను తయారు చేసుకోవచ్చని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయ మంత్రి ప్రతిమ భౌమిక్ తెలిపారు. రాజ్యసభలో ఎంపి జివిఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏ కులానికైనా ఒబిసి రిజర్వేషన్ కల్పించడానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి అవసరం లేదని వివరించారు.ఒబిసి రిజర్వేషన్ అంశం రాష్ట్ర జాబితాలోని అంశమని, కాబట్టి 2019లో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన చట్టం చట్టబద్ధమేనని వివరించారు. 2021లో చేసిన 105వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం సొంత జాబితాను తయారుచేసుకోవచ్చునని కేంద్రం పేర్కొన్నారు. మరోపక్క 103వ రాజ్యాంగ సవరణ చట్టం – 2019 ద్వారా రాష్ట్రప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు గరిష్ఠంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించవచ్చని తెలిపారు. రాష్ట్ర జాబితాలో ఉన్న కాపులకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్రం పాత్ర ఏమీలేదని స్పష్టత ఇచ్చారు.

# దేశంలో 2,41,826 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో 3,455, తెలంగాణలో 5,578 అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ 2022 జూన్ 30 నాటికి ఏపిలో 1,240 అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని, 2,304 అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 2,41,826 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. 1,27,564 అంగన్‌వాడీ వర్కర్స్ పోస్టులు, 1,14,262 అంగన్‌వాడీ హెల్పర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

**వైజాగ్ రైల్వే జోన్‌కు రూ.0.14 కోట్లే వ్యయం**

వైజాగ్ రైల్వే జోన్‌కు మూడేళ్లలో రూ.0.14 కోట్లు మాత్రమే ఖర్చు చేశామని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపి కె. రామ్మోహన్ నాయుడు, ఒరిస్సా ఎంపి సప్తగిరి శంకర్ ఉల్కా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వైజాగ్ రైల్వే జోన్‌కు 2020-21 బడ్జెట్‌లో రూ.3 కోట్లు ప్రతిపాదించగా, వ్యయం ఏమీ చేయలేదని తెలిపారు. 2021-22లో రూ.0.40 కోట్లు ప్రతిపాదిస్తే, రూ.0.08 కోట్లు వ్యయం చేశామని, 2022-23లో రూ.0.40 కోట్లు ప్రతిపాదించగా, రూ.0.06 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. ఈ మూడేళ్లలో రూ.3.80 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. 2022 నవంబర్ 10న రూ.106.89 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే జోన్ ప్రకటించామని చెప్పారు. కొత్త సౌత్ కోస్ట్ రైల్వే జోన్, రాయగడ డివిజన్ ఏర్పాటుకు సంబంధించిన అధికార పరిధి, ఇతర సమస్యలను సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం, రాయగడ్ డివిజన్ కార్యాచరణ కోసం ఎటువంటి కాలపరిమితిని నిర్ణయించలేదన్నారు.

**ఏపిలో ఐదేళ్లలో 35,574 మంది మహిళలు అదృశ్యం**

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో 35,574 మంది మహిళలు అదృశ్యమయ్యారని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. తెలంగాణలో 52,875 మంది మహిళలు అదృశ్యమయ్యారని, దేశంలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 11,49,337 మంది మహిళలు కనిపించడం లేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో 5,491 మంది చిన్నారులు, తెలంగాణలో 10,364 మంది చిన్నారులు అదృశ్యమయ్యారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా రాజ్యసభకు తెలిపారు. దేశంలో 2,10,682 మంది చిన్నారుల ఆచూకీ తెలియడం లేదన్నారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో 12,910, తెలంగాణలో 21,406 మంది చిన్నారులపై నేరాలు జరిగినట్లు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. గత మూడేళ్లలో ఏపిలో 55, తెలంగాణలో 152 బాల్య వివాహాలు జరిగాయన్నారు. దేశంలో గత మూడేళ్లలో 2,358 బాల్య వివాహాలు జరిగాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 2,19,816 మంది మహిళలకు ప్రధాన మంత్రి మాతృవందన యోజన (పిఎంఎంవివై) నగదు అందలేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. గర్భిణులు, పాలిచ్చే తల్లుల బ్యాంక్, పోస్టాఫీసు ఖాతాలో అందించే రూ.5,000 నగదు ప్రోత్సాహకం (మూడు వాయిదాలలో) ఏపిలో 2,19,816 మంది మహిళలకు అందలేదని, తెలంగాణలో ఒక్కరికీ అందలేదన్నారు.

## సెంట్రల్ యూనివర్సిటీల్లో 20,696 పోస్టులు ఖాళీ

**న్యూఢిల్లీ :** దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో 20,696 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 45 సెంట్రల్ యూనివర్సిటీల్లో 2022 డిసెంబర్ 1 నాటికి 6,180 బోధన పోస్టులు, 2022 జూలై 1 నాటికి 14,516 బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో 16 బోధన, 9 బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గిరిజన యూనివర్సిటీలో 18 బోధన, 12 బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ యూనివర్సిటీ ల్లో 2017 ఏప్రిల్ 1 నుంచి 2021 డిసెంబర్ 31 వరకు ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. దేశంలో 1,89,302 ఉపాధ్యాయ పోస్టులు తగ్గాయని, 20,021 పాఠశాలలు వ ం గా ని ఏ త ్ క ్ ం గురయ్యాయని మంత్రి అన్నపూర్ణాదేవి తెలిపారు.

## కక్ష సాధింపు మాని సమస్యలు పరిష్కరించండి

(మొదటి పేజీ తరువాయి)

ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఈ నిర్బంధాన్ని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల బహిరంగ సభలనే కాకుండా ఇన్‌డోర్ సమావేశాలను కూడా పోలీసులు అడ్డుకుంటున్నారని చెప్పారు. ఒక హాల్‌లో సమావేశమై చర్చించుకోవడం ఏ విధంగా చట్టవిరుద్ధమవుతుందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం తీవ్రమైన కార్మిక వ్యతిరేక చర్యన్నారు. గత చట్టాల్లో కార్మిక సంక్షేమానికి ఉపయోగపడే అనేక అంశాలను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని, పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేసేలా వీటిని రూపొందించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు తప్ప కార్మిక ప్రయోజనాలు లేబర్‌కోడ్‌లో ఎక్కడా లేవని, రాష్ట్ర ప్రభుత్వం వీటిని అమలు చేయాలనుకోవడం కార్మికుల వ్యతిరేకచర్యని వివరించారు. వీటి అమలు కోసం రూల్సు రూపొందించకూడదని డిమాండు చేశారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని వివరించారు. 50 లక్షల మందికి పైగా పనిచేస్తున్న షెడ్యూల్డు పరిశ్రమల్లో కార్మికుల వేతనాలను 20 సంవత్సరాలుగా సవరించడం లేదని, ఐదు సంవత్సరాలకొకసారి ధరల పెరుగుదలను బట్టి సవరించడం ప్రభుత్వ చట్టబద్ధ బాధ్యతని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి రూపాయి భారం ఉండదని, అయినా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాది మహిళలు తమ వేతనాలను సవరించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని, తెలంగాణా కంటే వెయ్యి రూపాయలు ఎక్కువగా ఇస్తామని హామీనిచ్చారని, దీని ప్రకారం రూ.14,500 ఇవ్వాలని రూ.11,500 మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ రంగంలో మూడు లక్షలకు పైగా ఉద్యోగ కార్మికులు సమాన పనికి సమాన వేతనాన్ని కోరుతున్నా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆందోళన చేస్తున్నారని ప్రభుత్వం వీటిన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్బంధ వైఖరికి నిరసనగా, సమస్యల పరిష్కారం కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నారని, దీనికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు.

**పోలవరం బాధితులను ముంచేశారు**

ప్రత్యేక హోదా ఇవ్వబోమని కేంద్రం చెబుతున్నా రాష్ట్రం కనీసం నోరెత్తడం లేదని, పోలవరం నిర్వాసితులకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో వరద బాధితులకు ఇంతవరకు ఎలాంటి పరిహారమూ ఇవ్వకుండా వారందరినీ గోదావరి ముంపు నీటిలో ముంచేశారని అన్నారు. పునరావాసానికి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**టిడ్కో ఇళ్లు ధ్వంసం**

వేలకోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన టిడ్కో ఇళ్లు ధ్వంసమవుతున్నాయని, వాటిని అర్హులకు పంచడం లేదని అన్నారు. ఈ ఇళ్లకు లబ్దిదారులే బ్యాంకులకు ఇప్పటికీ రుణాలు కడుతున్నారని అన్నారు. అయినా ప్రభుత్వం వాటిని పంచకపోవడంతో పాడైపోతున్నాయని, పిచ్చి మొక్కలు మొలిచి, పునాదులు దెబ్బతిన్నాయని తెలిపారు. తలుపులు చెదలు పట్టిపోతున్నాయని, నివాసయోగ్యానికి వీలుకాకుండా ఉన్నాయని వివరించారు. ఇటీవల తాము పర్యటించిన అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని పేర్కొన్నారు.

**పట్టణాల్లో శవాలపై వ్యాపారం**

పట్టణ ప్రాంతాల్లో మృతదేహాలను దహనం చేసేందుకు జిఎస్‌టితో కలిపి డబ్బు వసూలు చేస్తూ శవాలపై వ్యాపారం చేస్తున్నారని అన్నారు. రాయలసీమ జిల్లాల్లో అన్నమయ్య ప్రాజెక్టు దెబ్బతింటే ఇంతవరకు గేట్లు పెట్టలేదని, పైగా ప్రాజెక్టుల్లో గట్ల మట్టిని అక్రమార్కులు దోచుకుంటున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నా రైతులకు డబ్బులు చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారని తెలిపారు.


## నేపాలీ కాంగ్రెస్ పార్లమెంటరీ నేతగా షేర్ బహదూర్ దేబా

**ఖాట్మండు :** నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేబాను పార్లమెంటరీ పార్టీ నేతగా నేపాలీ కాంగ్రెస్ బుధవారం ఎన్నుకుంది. దీంతో కొత్త ప్రభుత్వంలో ప్రధాని పదవికి దేబా పాలక పార్టీ అభ్యర్థి కానున్నారు. రికార్డు స్థాయిలో ఐదుసార్లు ప్రధానిగా చేసిన దేబా తన సమీప ప్రత్యర్థి, పార్టీ ప్రధాన కార్యదర్శి గగన్ కుమార్ థాపాను 39 ఓట్లతో ఓడించారు. దేబాకు 64ఓట్లు రాగా, థాపాకు కేవలం 25 ఓట్లే వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ ఓటింగ్‌లో మొత్తంగా 89మంది పార్టీ ఎంపీలు పాల్గొన్నారు. ఇరువురు నేతలు మంగళవారం నామినేషన్లు వేయగా, బుధవారం ఓటింగ్ జరిగింది. నవంబరు 20న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. దీంతో తదుపరి ఏర్పడే కొత్త ప్రభుత్వానికి దేబా నాయకత్వం వహించే అవకాశాలున్నాయి.




**పిల్లలూ, చదువులో ఎంతో ముఖ్యమైన సబ్జెక్టుల్లో లెక్కలు ఒకటి. ఈ రోజు గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి. ఈ సందర్భంగా ఆయన గురించి తెలుసుకుందామా!**

# గణితశాస్త్రంలో రామానుజన్ ప్రయోగాలు




రామానుజన్ 1887 డిసెంబర్ 22వ తేదీన తమిళనాడులోని ఈరోడ్ పట్టణంలో అమ్మమ్మ ఇంట్లో జన్మించాడు.ఆయన తండ్రి కె శ్రీనివాస అయ్యంగార్ ఒక చీరల దుకాణంలో గుమస్తాగా పని చేసేవారు. తల్లి కోమలటమ్మాళ్ గృహిణి. తండ్రి ఉన్న చిన్న ఊరిలో విద్యాభ్యాసాన్ని ప్రారంభించాడు రామానుజన్ తండ్రి రోజంతా పనిలో లీనమవడం మూలంగా చిన్నపుడు అతని బాధ్యతలు తల్లే చూసుకునేది. దాంతో తల్లితో చాలా గాఢమైన అనురాగం కలిగి ఉండేవాడు. తల్లే మొదటి గురువు. చురుగ్గా, తెలివిగా చెప్పిన విషయాలు వెంటనే గ్రహించే వ్యక్తి.

పదకొండు ఏళ్ల వయసులోనే ఆంగ్లం, తమిళం, భూగోళ శాస్త్రం, గణితంలో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. మంచి మార్కులతో జిల్లాలో అందరికన్నా ప్రథముడిగా నిలిచాడు. రామానుజన్ హయ్యర్ సెకండరీ పాఠశాల్లో చేరినప్పుడే మొదటి సారిగా గణితశాస్త్రంతో పరిచయం ఏర్పడింది. ఆ సబ్జెక్టు పట్ల ఆసక్తి పెంచుకున్న ఆయన ఉపాధ్యాయులు చెప్పకముందే లెక్కలు ముందుగానే చేసి చూపించేవారు. కొత్త కొత్త విషయాలు కనిపెట్టి నోట్‌బుక్‌లో రాసుకునేవారు. నిత్యం అంకెలతో పేజీలు నింపేవారు.


ఆయన ప్రతిభను గుర్తించిన కలెక్టర్లు, మేధావులు రామానుజన్‌ను కొనియాడేవారు.

గణిత విశ్లేషణ, సంఖ్యా శాస్త్రం, అనంత శ్రేణులు, అవిరామ భిన్నాలు లాంటి గణిత విభాగాలలో విశేషమైన కృషి చేశాడు. అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా ఇతను పరిష్కారం కనుగొన్నారు. ఈయనలోని గణిత పరిశోధనా ప్రవృత్తి ఏకాంతంలోనే ఎక్కువగా అభివృద్ధి చెందింది. రామానుజన్ తన తన పరిశోధనను అర్థం చేసుకునే శాస్త్రవేత్తలకోసం వెతుకులాట భాగంగా 1913లో ఆయన ఇంగ్లండులోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో పనిచేసే జి. హెచ్. హార్డీ అనే గణిత శాస్త్రవేత్తను ఉత్తరాల ద్వారా సంప్రదించాడు. అతని పనిని చూసి ముగ్ధుడైన హార్డీ రామానుజాన్ని కేంబ్రిడ్జికి ఆహ్వానించాడు. రామానుజన్ ప్రతిపాదించినవి చాలా కీలకమైన సిద్ధాంతాలనీ, కొన్నైతే తాను కనీ వినీ ఎరుగనివని కూడా ఆయన అభిప్రాయపడ్డాడు. సుమారు 3900 ఫలితాలు రాబట్టి గణిత శాస్త్రవేత్తలచే ప్రశంసలు పొందారు. అందులో చాలా వరకు సమీకరణాలు, అనన్యతలే. వీటిలో చాలా వరకు సరికొత్తవి.

## నేను గీసిన బొమ్మ



- సి. అబ్దుల్ లతీఫ్, 6వ తరగతి, జడ్. పి. ఉన్నతపాఠశాల, మైదుకూరు, కడప జిల్లా



**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**

# తరతరాల రంగుల కళ

**మంగ పేద కుటుంబంలో పుట్టింది. తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో పెద్దగా చదువుకోలేదు. బిడ్డకు ఇంత అన్నం పెట్టేందుకు కూలీనాలీ చేసుకునే తల్లి ఆమెకు 17 ఏళ్లు నిండకుండానే పశుల మల్లేశం చేతిలో పెట్టింది. చిన్న వయసులో పెళ్లి, పిల్లలు, కుటుంబం.. ఎంతోమంది మహిళల జీవిత ప్రయాణంలో సర్వసాధారణం. మంగ కూడా ఆ జాబితాలో ఉంటే ఇప్పుడు మనం చెప్పకునేవాళ్లం కాదు. మంగ భర్త మల్లేశం నకాషీ కళాకారుడు. అతను చేసే పనిలో చేదోడువాదోడుగా ఉంటూనే ఆ కళలో రాణించారు మంగ. ఎంతలా నైపుణ్యం సాధించారంటే ఎంతోమంది ప్రశంసలు, అవార్డులతో పాటు దేశవిదేశాల్లో ప్రదర్శనలిచ్చే స్థాయికి వెళ్లారు.**




'నా భర్త 30 ఏళ్లుగా నకాషీ కళనే నమ్ముకున్నారు. ఆ పనిలో ఆదాయం, ఆదరణ రెండూ లేవు. అయినా మేం నిరుత్సాహ పడలేదు. చాలీచాలని ఆదాయంతో రోజులు గడిపేవాళ్లం. ఎంతో చరిత్ర ఉన్న కళ మా కళ్ల ముందే కనుమరుగై పోతుంటే తట్టుకోలేకపోయేవాళ్లం. అంతరించి పోయిందనుకున్న ఆ ప్రాచీన కళకు నూతన హంగులు అద్దాం. ఇప్పుడు దేశంలోనే కాదు, విదేశాల్లో కూడా ఎగ్జిబిషన్లలో మా కళారూపాలు ప్రదర్శిస్తున్నాం. ప్రస్తుతం నా కుటుంబంతో పాటు మరో పది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాను. ఆకలితో పస్తులు పడుకున్న రోజులున్నాయి. వారం వ్యవధిలో కరోనాతో అమ్మా, అత్తయ్య చనిపోయిన దు:ఖం మా కుటుంబానికి పెద్ద విషాదం. ఇన్ని బాధలు పడినా.. కళను ఎప్పుడూ విడిచిపెట్టలేదు. నకాషీ కళాకారిణిగా గుర్తింపు సంపాదించాను. ఇప్పుడు కళకు వస్తున్న ఆదరణ చూస్తుంటే సంతోషంతో మనసు నిండిపోతుంది' అంటున్నారు మంగ.

తెలంగాణ సిద్ధిపేట జిల్లా చేర్యాల గ్రామం నకాషి కళకు పెట్టింది పేరు. దనాలకోట వెంకట రామయ్య కుటుంబం నుంచి ఈ కళ మొదలైనట్లు స్థానికులు చెబుతారు. ఆయన కొడుకు చంద్రయ్య దగ్గర మల్లేశం కళను నేర్చుకున్నారు. నేర్చుకున్న వాళ్లలో ఇద్దరే గ్రామంలో ఉన్నారు. వారసత్వంగా రాకపోయినా కళ మీద అభిమానంతో మంగ కుటుంబం కళాకారుల కుటుంబంగా పేరు గడించింది.

**ఇదీ చరిత్ర..**

తెలంగాణ సబ్బండ వర్ణాల చరిత్రను భావితరాలకు అందించడంలో నకాషీ చిత్రాలు, బొమ్మలు చాలా ఉపయోగపడేవి. ఈ కళ సుమారు 400, 500 ఏళ్ల నాటిది. టీవీలు, ఫోన్లు లేని కాలంలో కాలక్షేపం కింద వీధినాటక కళాకారులు ఊరూరు తిరుగుతూ చరిత్ర, కథలు చెప్పడం మనకు తెలుసు. అలా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాల్లో నకాషీ కళకు గొప్ప ఆదరణ ఉండేది. గొల్లకుర్మలు, ముదిరాజులు, గౌడ కులాల చరిత్రలు చెప్పడానికి మందిచ్చెలోళ్లు, కాకిపడగలోళ్లు నకాషీ కళాకారుల దగ్గరికి వచ్చి బొమ్మలు వేయించుకునేవారు. కాటమరాజు, పెద్దిరాజుల కథలు, గొల్లకుర్మల పురాణం, గౌడ పురాణం, మార్కెండేయ పురాణం వంటి పది కులాల చరిత్రలను చెప్పేవారు. ఒక్కో కథకు 50 నుంచి 60 బొమ్మలు అవసరమయ్యేవి. వాళ్లు కథ చెబితే దానికి తగ్గట్లు నకాషీ కళాకారులు బొమ్మలు వేసిచ్చేవాళ్లు. 50, 60 మీటర్ల వస్త్రంపై 5 వేల పైచిలుకు బొమ్మలు వేస్తారు. వస్త్రంపై నుంచి కింది వరకు వేసిన నకాషీ చిత్రాలతో కళాకారులు ఊరూరు తిరుగుతూ కథలు చెప్పేవారు. కళాకారులతో పాటు బొమ్మలు వేసే ఎంతోమంది వృత్తి కళాకారుల కడుపునింపిన కళ ఇది. అయితే కొన్నేళ్ల కిందటే అంతరించే పోయే దశకు చేరుకుంది. 1991 నాటికి చేర్యాలలో ఒక్కటంటే ఒక్కటే కళాకారుల కుటుంబం ఉండేది. ఇప్పుడు కూడా పదిలోపు కుటుంబాలే ఈ కళను నమ్ముకుని ఉన్నాయి.

**కాలంతో పాటు మేమూ మారాం..**

'ఇప్పుడు కాలం మారింది. మా బొమ్మలు కొనేవారు లేరు. అందుకే చిన్న చిన్న వస్త్రాలపై వివిధ కళారూపాలు చిత్రించి ఫ్రేములు కట్టి విక్రయిస్తున్నాం. చింతగింజల పొడి, చెక్కపొడి, వివిధ రకాల సహజ రంగులతో చేతితోనే బొమ్మలు తయారుచేస్తాం. ఎగ్జిబిషన్లలో పెడుతున్నాం' అంటున్నారు మంగ.

కొత్త రూపంలోకి మారిన నకాషీ కళలో ఇప్పుడు రాధాకృష్ణులు, గోపాలుడు, గణపతి, వరుడు, వధువు, గడ్డివాము ఎత్తుకెళుతున్న యువతి, కీచెయిన్లు, పెయింటింగ్స్, పెన్‌స్టాండ్స్, కాటమరాజు, గంగాదేవి బొమ్మలు, మల్లన్న బొమ్మలు, 52 బొమ్మల సెట్, రకరకాల మాస్కులు వంటివి తయారుచేస్తున్నారు.

'గతంలో కథకులకు ఇచ్చే బొమ్మల రూపంలో వచ్చే ఆదాయం అంతంతమాత్రమే ఉండేది. లేపాక్షి ఎంపోరియానికి ఆర్డరుపై బొమ్మలిచ్చినా కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. అప్పుడే పిల్లల సాయంతో ఆన్‌లైన్ అమ్మకాలు మొదలుపెట్టాం. ప్రభుత్వం నుంచి ఆర్డర్లు తీసుకుంటున్నాం. ఇప్పుడు కొంతమంది ఇళ్లల్లో కాన్వాస్ పెయింటింగ్‌లా నకాషీ కళను వేయించుకుంటున్నారు. ఇవన్నీ మాకు ఎంతోకొంత ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి' అంటున్నారు మంగ. ఆమె భర్త మల్లేశం చేస్తున్న కృషికిగాను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర అవార్డుతో సత్కరించింది. మరెన్నో ప్రశంసలు, అవార్డులు సొంతం చేసుకున్నారు ఈ దంపతులు. కళారూపాలు ప్రదర్శించేందుకు మల్లేశం మెక్సికో నగరానికి కూడా వెళ్లారు.

'రెండేళ్ల నుంచే కళ విస్తృతంగా ప్రజాదరణ పొందుతోంది. ఆర్డర్లపై తయారుచేస్తున్నాం. కళను నేర్చుకునేందుకు యువత ముందుకొస్తోంది. మా పిల్లలు కూడా మాతోబాటే పనులు చేస్తారు. కళను నమ్ముకుని మా గ్రామంలో ప్రస్తుతం ఏడు కుటుంబాలే ఉన్నాయి. ఈ సంఖ్య మరింత పెరగాలి. నకాషీ కళ చరిత్ర చెప్పేందుకు ఎంత దూరమైనా ప్రయాణిస్తాం' అంటున్న మంగ ఢిల్లీ వంటి మహానగరాల్లో నిర్వహించిన ఎన్నో ఎగ్జిబిషన్లలో కళారూపాలు ప్రదర్శించారు. ఓ సాధారణ మహిళ సాధించిన అసాధారణ విజయమిది. ఆమెతో పాటు పిల్లలు కూడా ఈ కళపై పట్టుసాధించడం చూస్తుంటే కళాభిమానుల హృదయాలు పరవశించిపోతాయి.

**- జ్యోతిర్మయి**



ఒకప్పుడు బీడీలు చుట్టే పనికి వెళ్లేదాన్ని. కూలి అంతంతమాత్రమే వచ్చేది. ఇప్పుడు ఈ కళ నేర్చుకుంటూ గతంలో కంటే ఎక్కువే సంపాదిస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

**సునీత, కళాకారిణి.**



నాకు 45 ఏళ్లు. ఇంట్లోనే ఉండేదాన్ని. దూరం నుంచి ఇక్కడికి వచ్చి నేర్చుకుంటున్న కొంతమందిని చూశాను. నాకు కూడా ఆసక్తి కలిగింది. ఇప్పుడు కళను నేర్చుకుంటూ సంపాదిస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది.

**సత్యవతి, కళాకారిణి.**

**మా చిరునామా**
**రంగవల్లి**
**ప్రజాశక్తి దినపత్రిక**
**ప్రజాశక్తి భవనం**
**అరవింద హై స్కూలు దగ్గర, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా.**
**మెయిల్ ఐడి :** jeevana-pageps@gmail.com
**వాట్సాప్ : 83329 25496**

## రంగవల్లి







**బేబీ, బొమ్మూరు, తూర్పుగోదావరి జిల్లా. 15 చుక్కలు 1 వచ్చేవరకు (సరి చుక్క)**



## నేనొక నటుణ్ణి...

కృష్ణవంశీ దర్శకత్వం వహిస్తున్న 'రంగమార్తాండ' చిత్రం నుంచి తాజాగా ఓ షాయరీ చెప్పే వీడియో విడుదలైంది. రంగస్థల కళాకారుల గురించి వివరించే ఈ షాయరీకి చిరంజీవి గళం అందించారు. 'నేనొక నటుడిని అంటూ సాగే ఈ షాయరిని చెప్పే సమయంలో చిరంజీవి భావోద్వేగపడినట్లు కనిపిస్తోంది. ఈ వీడియోలో చిరంజీవి పలికిన మాటలు, చూపించిన సన్నివేశాలు సగటు కళాకారుల జీవితానికి అద్దం పట్టేలా ఉన్నాయి. సోషల్ మీడియా వేదికగా ఈ వీడియోను విడుదల చేశారు. లక్ష్మీ భూపాల్ దీనికి అక్షర రూపం ఇచ్చారు. ఇళయరాజా సంగీతం అందించారు. ప్రకాష్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, అనసూయ భరద్వాజ్, శివాత్మిక రాజశేఖర్, రాహుల్ సిప్లిగంజ్, ఆదర్శ్ బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## పండగ తర్వాత షూటింగ్‌కు



హీరోయిన్ సమంత ఇటీవల అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె కొంత కాలం షూటింగ్‌లకు విరామం ఇవ్వనున్నట్లు, కొన్ని ప్రాజెక్టుల నుంచి తప్పుకుంటున్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో సమంత టీం స్పందించింది. మేనేజర్ మహేంద్ర మాట్లాడుతూ 'సమంత ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటోంది. సంక్రాంతి తర్వాత ఖుషి షూటింగ్‌లో పాల్గొనబోతోంది. ఆ తర్వాత తన బాలీవుడ్ ప్రాజెక్ట్‌లో నటించనుంది. జనవరి నుంచి హిందీ సినిమాకు డేట్స్ ఇచ్చాం. కానీ అనుకోని కారణాల వల్ల సినిమా షూటింగ్‌లు దాదాపు ఆరు నెలలు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. హిందీ సినిమా షూటింగ్స్‌కు ఏప్రిల్ లేదా మే నెల్లో పాల్గొంటారు. ఆమె తన రాబోయే ప్రాజెక్టల నుంచి తప్పుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదు.' అని స్పష్టం చేశారు.



## క్రిస్మస్ సంబరాల్లో యువ తారలు

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా రామ్ చరణ్, ఉపాసన, అల్లు అర్జున్, స్నేహ దంపతులు, వరుణ్ తేజ్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, నిహారిక, శిరీష్, సుస్మితా, శ్రీజ తదితరులు పాల్గొన్న ఓ కార్యక్రమ ఫొటో సోషల్ మీడియాలో ఉపాసన షేర్ చేశారు. యువ నటీనటులతో నిండిపోయిన ఈ ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

## యాక్షన్ పార్టు పూర్తి



పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. చాలా రోజులుగా రామోజీ ఫిలిం సిటీలో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తుంది డైరెక్టర్ క్రిష్ టీం. ఇప్పుడు మేజర్ యాక్షన్ పార్ట్ పూర్తయింది. ఈ విషయాన్ని యాక్షన్ కొరియోగ్రఫర్ విజయ్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తర్వాత సీక్వెన్స్ కోసం టీం ప్రిపరేషన్ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ విజయ్ దేవుని బొమ్మ అందజేశారు. ఆయనతో దిగిన ఫోటోను విజయ్ షేర్ చేశారు. మేఘసూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తున్న చిత్రంలో బాలీవుడ్ యాక్టర్లు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు.. ఈ చిత్రాన్ని 2023 వేసవిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఓటీటీలో ఉచితంగా 'రామ్ సేతు'

అక్షయ్‌కుమార్ ప్రధాన పాత్రలో దర్శకుడు అభిషేక్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'రామ్ సేతు'. ఈ మూవీ దీపావళి కానుకగా అక్టోబర్‌లో విడుదలైంది. ఇతిహాసాల్లో నిజాల్ని వెలికితీసే పురాతత్వ శాస్త్రవేత్తగా అక్షయ్ నటించారు. ఈ చిత్రం ఓటీటీ అమెజాన్ ప్రైమ్ వీడియోలో డిసెంబర్ 23 నుంచి ఉచితంగా ఖాతాదారులకు ఎంటర్‌టైన్ చేయనుంది. ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో సత్యదేవ్ కీలక పాత్రను పోషించారు.

## చదువుకుంటూ నటిస్తున్నాను..



రవితేజతో కలిసి యువనటి శ్రీలీల చేస్తున్న సినిమా 'ధమాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. పీపుల్స్‌మీడియా ఫ్యాక్టరీ నిర్మించింది. డిసెంబరు 23న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా శ్రీలీల మీడియాతో కొన్ని విశేషాలు పంచుకున్నారు. 'ఒకవైపు మెడిసిన్ చదువుతూ మరోవైపు సినిమాల్లో నటిస్తున్నాను. షూటింగ్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొద్దిసేపు చదువుకుంటా. సినిమా విషయానికొస్తే.. త్రినాథరావు నక్కిన తీసిన 'హలో గురు ప్రేమకోసమే'లో ఓ పాత్ర కోసం నన్ను సంప్రదించారు. అప్పుడే రచయిత ప్రసన్న కూడా పరిచయమయ్యారు. కానీ, కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు. 'పెళ్లి సందడి" విడుదల కాకముందే 'ధమాకా' కథ చెప్పారు. కథ చెప్పిన పది నిమిషాలకే ఓకే చేశాను. ఇది మంచి ఎంటర్‌టైనింగ్ మూవీ. రెండో సినిమా రవితేజలాంటి స్టార్ హీరో కావడంతో మొదట చాలా టెన్షన్ పడ్డా. కానీ, రవితేజ నన్ను ఎంతో ప్రోత్సహించారు. నటనకు సంబంధించిన ఎన్నో విషయాలను పంచుకున్నారు. ఈ సినిమాలో నేను ప్రణవి పాత్రలో కనిపిస్తా. డ్యూయల్ రోల్‌తో ట్రావెల్ అయినప్పుడు ఒక తికమక ఉంటుంది. ట్రైలర్‌లో చెప్పినట్లు ఇద్దరూ ఇష్టం అంటే.. ముగింపు ఎలా ఉంటుందనేది ఇందులో ట్విస్ట్ ఫ్యాక్టర్'.

# క్లీన్‌స్వీప్ పై గురి

## బంగ్లాదేశ్‌తో చివరి టెస్ట్ నేటినుంచే..




**ఉదయం 9.00గం॥ల నుంచి**

**ఢాకా:** తొలి టెస్ట్‌లో గెలిచిన టీమిండియా ఇక క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ తొలి టెస్ట్ గెలిచి 1-0 ఆధిక్యతలో ఉంది. షేర్-ఏ-బంగ్లా స్టేడియంలో జరిగే టెస్ట్‌లోనూ గెలిచి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దారి సుగమం చేసుకోనుంది. ఛోటోగ్రామ్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో భారత బౌలర్లు రాణించడంతో బంగ్లాదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 150పరుగులకే కుప్పకూలింది. ఆ టెస్ట్‌లో టీమిండియా 188పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. కెప్టెన్ రోహిత్ శర్మ, పేసర్ నవ్‌దీప్ సైనీ ఈ టెస్ట్‌కు దూరం కావడంతో తొలిటెస్ట్‌లో ఆడిన భారత ఆటగాళ్లే రెండో టెస్ట్‌లోనూ బరిలోకి దిగనున్నారు. ఐసిసి టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 87పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా 120పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. కాగా, రెండో టెస్ట్‌లో భారత తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచుస్తున్నారు. తొలి టెస్ట్ ప్రదర్శన ఆధారంగా ఎలాంటి మార్పులకు అవకాశం లేనప్పటికీ అశ్విన్ స్థానంలో లెఫ్ట్ ఆర్మ్ ఆర్థోడాక్స్ స్పిన్నర్ సౌరభ్ కుమార్‌కు అవకాశం కల్పించే ఛాన్స్ ఉంది. ఈ మైదానం స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉండటంతో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. ఇక బంగ్లాదేశ్ జట్టుకు తస్కిన్ అహ్మద్ అందుబాటులోకి వచ్చాడు. భారత్‌తో ఆడిన తొలి టెస్ట్‌కు అతడు దూరం కావడం, ముస్తాఫిజుర్ టెస్ట్‌కు ఎంపిక కాకపోవడంతో ఆ జట్టు ఓడినట్లు జట్టు యాజమాన్యం భావిస్తోంది.

**జట్లు(అంచనా):**

**భారత్:** కేఎల్ రాహుల్(కెప్టెన్), శుభ్‌మన్, పుజారా, కోహ్లి, శ్రేయస్, అక్షర్, పంత్(వికెట్ కీపర్), అశ్విన్, కుల్దీప్, ఉమేశ్/ఉనాద్కట్, సిరాజ్/సౌరభ్ కుమార్.

**బంగ్లాదేశ్:** షకీబ్(కెప్టెన్), నూరీ హసన్(వికెట్‌కీపర్), నజ్ముల్, యాసిర్, లింటన్ దాస్, ముష్ఫికర్, మెహిదీ, తైజుల్, తస్కిన్, మోమిముల్/ఖలీద్ అహ్మద్, మోమినుల్ హక్.



## ఆ పోస్ట్‌కు ఇన్‌స్టాలో 6.8కోట్ల లైక్‌లు

### సోషల్ మీడియాలోనూ మెస్సీ నయా రికార్డు

**బ్యూనస్‌ఎయిర్:** ఇన్‌స్టాగ్రామ్‌లోనూ అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ రికార్డులు తిరగరాస్తున్నాడు. ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్ ఫోటోలను మెస్సీ ఓ గ్యాలరీగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్టు చేశాడు. ఇప్పటికే ఆ గ్యాలరీ 6.8 కోట్ల లైక్‌లు వచ్చేశాయి. ఆ గ్యాలరీలో కప్ గెలిచిన తర్వాత ఎంజాయ్ చేస్తున్న అర్జెంటీనా టీమ్ ఫోటోలు ఉన్నాయి. గతంలో ఇన్‌స్టాలో అత్యధిక లైక్‌లు వచ్చిన పోస్టు బ్రౌన్ ఎగ్. 2019లో ఆ పోస్టు చేశారు. ఆ ఎగ్ పోస్టుకు సుమారు 5.7కోట్ల లైక్‌లు వచ్చాయి. తాజాగా ఆ రికార్డును మెస్సీ బ్రేక్ చేసి ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేశాడు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టుపై షూటౌట్‌లో అర్జెంటీనా నెగ్గిన విషయం తెలిసిందే. ఫైనల్లో మెస్సీ రెండు గోల్స్ చేశాడు. బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీకి ఇచ్చే గోల్డెన్ బాల్‌ను మెస్సీ గెలుచుకున్నాడు.

## రమీజ్ రాజాపై వేటు..

### పాక్ నూతన ఛైర్మన్‌గా నజామ్



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) ఛైర్మన్ పదవి నుంచి రమీజ్ రాజాను ప్రభుత్వం తొలగించింది. రమీజ్ స్థానంలో నజామ్ సేథీకు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పిసిబి ఛైర్మన్ పేరును పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఆమోదించారు. ఇంగ్లండ్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో పాక్ ఘోర పరాజయం పాలైంది. దీంతో స్వదేశంలో పాక్ జట్టు 60ఏళ్లలో తొలిసారి వైట్‌వాష్‌కు గురైంది. దీంతో పిసిబి బోర్డు సభ్యులు రమీజ్‌ను ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఇందులో భాగంగా పిసిబిలో మార్పుల కోసం న్యాయశాఖ సైతం ప్రధానికి విజ్ఞప్తి చేసింది. రమీజ్ తొలగింపులో రాజకీయ జోక్యం ఉన్నట్లు సమాచారం.

## ఆంధ్ర 297ఆలౌట్

### పట్టు బిగిస్తోన్న తమిళనాడు రంజీట్రోఫీ మ్యాచ్




**చెన్నై:** రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి రెండో మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 297పరుగులకే కుప్పకూలింది. తమిళనాడు బౌలర్లు చెలరేగడంతో ఓవర్ నైట్ స్కోర్‌కు మరో 20పరుగులు జతచేసి ఆంధ్ర జట్టు 5 వికెట్లను చేజార్చుకొంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన తమిళనాడు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 273పరు గులు చేసింది. ఓపెనర్ సుదర్శన్(113),బాబ అపరాజిత్ (88) బ్యాటింగ్‌లో రాణించారు. రెండో రోజు ఆట నిలిచే సమయానికి వాషింగ్టన్ సుందర్(7), విజయ్ శంకర్(0) క్రీజ్‌లో ఉన్నారు. లలిత్ మోహన్‌కు రెండు, శశికాంత్, నితీష్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

**రహానే డబుల్ సెంచరీ..**

హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి కెప్టెన్ అజింక్యా రహానే (204) డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. సర్ఫ్ రాజ్ ఖాన్(126) కూడా సెంచరీతో మెరవడంతో రెండోరోజు ముంబయి జట్టు 6వికెట్ల నష్టానికి 651పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. కార్తికేయకు మూడు, శశాంక్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్లు కోల్పోయి 173పరుగులు చేసింది. రోహిత్ రాయుడు (72నాటౌట్)కి తోడు త్యాగరాజన్(1) క్రీజ్‌లో ఉన్నారు. కెప్టెన్ అగర్వాల్(40) రాణించినా.. నిఖిల్(6), రవితేజ(6), రికీ బుయ్(18), ప్రతీక్ రెడ్డి(7) బ్యాటింగ్‌లో నిరాశపరిచారు. శ్యామ్ ములానికి ఐదు వికెట్లు లభించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68